


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 104 | ది. 24-7-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 104 | Date : 24-7-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# నేడే మెగా పీటీయం 4.0




ఈరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్న భోజన సమయం వరకు
ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో జరిగే
**మెగా పేరెంట్ టీచర్ సమావేశం 4.0కు**
**విద్యార్థుల తల్లితండ్రులందరికీ ఆహ్వానం**

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ
వరుసగా రెండో ఏడాదీ
తల్లికి వందనం సకాలంలో విడుదల



67,47,190 విద్యార్థుల కోసం
42,70,802 తల్లుల/ సంరక్షకుల
ఖాతాల్లో రూ.10,120.78 కోట్ల
తల్లికి వందనం నిధులు జమ

Mega PTM 4.0కు వచ్చి
మీ పిల్లల హోలిస్టిక్
ప్రోగ్రెస్ కార్డులను అందుకోండి





డొక్కా సీతమ్మ
మధ్యాహ్న భోజన పథకం కింద
మీ పిల్లలకు అందిస్తున్న శ్రేష్ఠమైన
పౌష్టికాహారాన్ని ఆస్వాదించండి




LEAP యాప్‌ను డౌన్‌లోడ్
చేసుకుని... మీ పిల్లల పురోగతిని
నిరంతరం పర్యవేక్షించండి



Donor పోర్టల్ ద్వారా
మీకు నచ్చిన పాఠశాలల
అభివృద్ధిలో భాగస్వాములవ్వండి



ఆటల్లో పాల్గొనండి...
బహుమతులు గెలుచుకోండి

విద్యావ్యవస్థను తీర్చిదిద్దడంలో మనందరం భాగస్వాములవుదాం-మన పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును ఇద్దాం

# వి హెచ్ పి ఆధ్వర్యంలో బాల గంగాధర్ తిలక్ జయంతి



**పెడన,జూలై 23 (వార్తాప్రభ) :** విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ వినాయకుని ఆలయంలో లోకమాన్య బాల గంగాధర తిలక్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించబడింది. తొలుత శ్రీ వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాల గంగాధర తిలక్ జాతీయోద్యమ సేవలు వినాయక ఉత్సవాలను జాతీయ చైతన్యానికి వేదికగా మలిచిన ఆయన మహోన్నత కృషిని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొర్రిపాటి గోపీచంద్ పి.వి. ఫణి కుమార్ ధన్వంతరి చారి కొట్టి వెంకటరావు ఊర రామాంజనేయులు పంతం గజేంద్ర దూళిపాల రాము వేణుగోపాలరావు ఆడుసుమిల్లి శ్రీనివాసరావు నిమ్మగడ్డ శ్రీధర్ పి. శ్రీనివాసరావు ప్రసన్న ఆంజనేయులు వర్రె రాజశేఖర్ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం శైలత వసుంధర పిచ్చుక శంకరరావు మహంకాళి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ సారె అందించిన ఆర్యవైశ్య పెద్దలు ఆడపడుచులు





**విస్సన్నపేట,జూలై 23 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ఆలయ చైర్మన్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తిరువూరు ఏఎంసి వైస్ చైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు మరియు ఆర్యవైశ్య ఆడపడుచులు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో కుటుంబ సమేతంగా ఆషాఢ సారె అందించారు. వేద పండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో మామిడి తోరణాలు మంగళ వాయిద్యాలతో ఆర్యవైశ్య ఆడపడుచులు 108 రకాల ఫలహార ప్రసాదాలతో అంగరంగ వైభవంగా నభూతో నభవిష్యతి అన్నచందంగా ఊరేగింపుగా వెళ్లి శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి కి పట్టు వస్త్రాల సారె అందించారు. ఆర్యవైశ్య సుహాసినిలు భక్తిశ్రద్ధలతో శ్రీ లలితా సహస్రనామ పారాయణం శ్రీ సౌందర్య లహరి పారాయణంలను నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ లక్ష్మణరావు, ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం అధ్యక్షుడు కంభంపాటి బద్రీనాథ్, శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర్ స్వామి వారి ఆలయ చైర్మన్ వెంపటి శ్రీకృష్ణ జనార్దన రావు, శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయ చైర్మన్ నెక్కలపు రవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తెలుగు డ్రామా రైటర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా టీ తాతారావు యాదవ్



**గుంటూరు, జూలై 23 (వార్తాప్రభ) :** తెలుగు నాటక రంగ కళాకారుల సంక్షేమ సేవా సంఘం (టి.ఎన్.కే.ఎస్ ఎస్.) ప్రెసిడెంట్ నివాస్ వాల్మీకి టి. తాతారావు యాదవ్ ను తెలుగు డ్రామా రైటర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా టి. తాతా రావు యాదవ్ ను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా నివాస్ వాల్మీకి కి తాతా రావు హృదయపూర్వక కృతజ్ఞతాభినందనలు తెలియజేయడం జరిగింది తెలుగు డ్రామా రైటర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా టీ తాతారావు యాదవ్ ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా తాతా రావు కి యువ రైటర్స్ టి.అంకమ్మరావు నాయుడు నివాస్ వాల్మీ కి .శ్రీనివాస నాయుడు,ఎన్.లక్ష్మీనారాయణ పి.శ్రీనివాస్ నాయుడు నూతక్కి బాబు శోభన్ బాబు వెంకటేష్ మన్మధరావు చౌదరి సన్నీ కోయ కోటేశ్వరావు చైతన్య వాల్మీకి టి. ఎన్. కే. ఎస్.ఎస్ జనరల్ బాడీ సభ్యులు అభినందనలు తెలిపారు.

# గుడివాడ పోస్ట్ ఆఫీస్‌ల వద్ద.. "తల్లికి వందనం" కోసం తల్లుల క్యూ



**గుడివాడ,జూలై 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం నిధుల కోసం గుడివాడ పోస్ట్ ఆఫీస్ వద్ద గురువారం తల్లులతో కిటకిటలాడింది. పిల్లల ఖాతాలో నిధులు జమ అయ్యాయో లేదో తెలుసుకునేందుకు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో తల్లులు పోస్ట్ ఆఫీస్ కు తరలివచ్చారు. నగదు డ్రా చేసుకునేందుకు గంటల తరబడి లైన్లలో నిలబడ్డారు. అయితే గుడివాడలో నగదు పంపిణీకి కేవలం 3 కేంద్రాలు మాత్రమే ఉండటంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి లైన్‌లో ఉన్నా ఇంతవరకు డబ్బులు తీసుకోలేకపోయామని తల్లులు ఆవేదన వ్యక్తం చేశారు. రద్దీ దృష్ట్యా పోస్ట్ ఆఫీస్ వద్ద అదనపు కౌంటర్లు, సిబ్బందిని ఏర్పాటు చేసి వేగంగా నగదు పంపిణీ చేయాలని తల్లులు అధికారులను కోరారు.

# చిట్టి గూడూరు పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



**పెడన,జూలై 23 (వార్తాప్రభ) :** గూడూరు మండలం చిట్టి గూడూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల విశిష్ట సేవలు -- పి 4 కార్యక్రమంలో పాల్గొన్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి 4 కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలం చిట్టి గూడూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను మరియు విద్యార్థులకు అవసరమైన పలు విద్యా పరికరాలను పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పూర్వ విద్యార్థులతో కలిసి గురువారం ప్రారంభించారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాతల సహకారంతో సమకూరిన నిధులను విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వినియోగిస్తూ ఆధునిక విద్యా సౌకర్యాలు అవసరమైన ఫర్నిచర్ విద్యా పరికరాలు విద్యా సాంస్కృతిక సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలమైన వసతులను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సమాజాభివృద్ధికి తమవంతు బాధ్యతగా ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలు పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోపి నాగబాబు డీసీ చైర్మన్ పోతన స్వామి నాయుడు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు అన్నం హరి రామ్ కృష్ణ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్ ఏ బేగ్ గూడూరు పిఎసిఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు మురాల దణేష్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కోలపల్లి రజిని కుమార్ గూడూరు బ్యాంకు డైరెక్టర్ చింతగుంట కృష్ణ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొరిపర్తి చంద్రశేఖర్ క్లస్టర్ ఇంచార్జి పెద్దిరాజులు మాజీ సర్పంచ్ లు పుప్పాల సురేష్ పోతన రామోజీ కాట్రగడ్డ రత్నారావు, సుంకర రవి కటకం నాగమల్లేశ్వరరావు బాసంశెట్టి విజయ్,గంజాల కృష్ణ మోహన్,లంక చంటి రసంశెట్టి శివ రావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి నవీన్ఎ మ్మార్వో డి రాజ్యలక్ష్మి, ఎంపీడీవో శైలజ కుమారి డివైఈవో శేఖర్ సింగ్ ఈవోపీఆర్డి రాజేశ్వరి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జి నాగరాజు ఎస్సై సిహెచ్ దివ్య ప్రకాష్ సిహెచ్ లక్ష్మి నారాయణ వి. శ్రీహరి డి.వీర ప్రసాద్ పీ రఘురాముడు సిహెచ్ వినయ్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వంశీ ఏ.అజయ్ పాల్గొన్నారు

# ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు -- 'తల్లికి వందనం'తో ప్రతి విద్యార్థికి అండ

- ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగింది: తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు



**తిరువూరు, జూలై 23 (వార్తాప్రభ) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు కొనియాడారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా, ప్రతి తల్లిదండ్రికి భరోసా కల్పించే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమం--అభివృద్ధిని సమన్వయం చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ పథకం వల్ల వేలాది కుటుంబాలకు ఆర్థిక ఊరట లభించడంతో పాటు విద్యార్థుల్లో ఉన్నత చదువుల పట్ల మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆయన తెలిపారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి ఇంటి అభివృద్దే రాష్ట్ర అభివృద్ధికి పునాది అనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# మహిళలూ...గ్రూపుల్లా ఏర్పడండి రుణాలు ఇస్తాము...

-కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని



**పెడన,జూలై 23 (వార్తాప్రభ) :** పెడన మండలం కట్లపల్లి మడక పాల కేంద్రాలను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు గురువారం సందర్శించినారు మిల్క్ సొసైటీ అధ్యక్షులు వీరంకి నాగ రమ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో చలసాని ఆంజనేయులు రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం మాట్లాడుతూ గ్రామంలో మహిళలు గ్రూపుల్లాగా ఏర్పడితే గ్రామీణ బ్యాంకుల ద్వారా ఒక మహిళకు 80 వేల రూపాయలు రుణాలు అందచేయునున్నట్లు చెప్పారు రైతులు పశుదాన ఖచ్చితముగా వాడితే మెరుగైన ఫలితాలు సాధిస్తారని రైతులకు సూచించారు దాంతోపాటు మినరల్ మిక్చర్ కూడా వాడితే గేదెలు ఆరోగ్యవంతంగా ఉంటాయని తెలిపారు పాడి గేద "మూడు నెలలలో" ఎదకు రావాలని అలా వచ్చినట్లయితే రైతుకు లాభదాయకం ఉంటుందన్నారు ఎదకు వచ్చిన గేదల కోసం తమిళనాడు నుంచి పేయ్యదూడల సెమన్ను దిగుమతి చేసుకున్నామని తద్వారా 95 శాతం పేయ్యదూడలు పుడతాయని అవి పెరిగిన తరువాత పూటకు ఎనిమిది లీటర్లు పాలిస్తాయని ఇది రైతులకు మంచి సువర్ణ అవకాశమని ఈ అవకాశాన్ని రైతులు రైతు సోదరులు వినియోగించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కృష్ణ మిల్క్ యూనియన్ డైరెక్టర్ పెడన జడ్పిటిసి అర్జా వెంకట్ నగేష్ చండిక సుబ్బారావు దాసరి కొండలరావు మట్ట పరశురాం కారే రవి వంకా గౌరీ శంకర్ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు చలసాని ఆంజనేయులు అత్యధికంగా పాలు పోసిన రైతును శ్రీ ముక్కు హనుమంతరావు శాలువాతో ఘనంగా సత్కరించారు.

# వీరవల్లి హైవేపై ట్రావెల్స్ బస్సు--లారీ ఢీ.. తప్పిన భారీ ప్రమాదం





**హనుమాన్ జంక్షన్,జూలై 23 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలం వీరవల్లి జాతీయ రహదారిపై గురువారం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, విజయవాడ నుంచి రాజమండ్రి వెళ్తున్న ఐటీసీ కంపెనీకి చెందిన లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రతకు లారీ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అయితే అదృష్టవశాత్తూ లారీ డ్రైవర్, బస్సు డ్రైవర్‌తో పాటు బస్సులోని ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా పడిన లారీని, బస్సును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా తిలక్ అజాద్ ల జయంతి వేడుకలు



**కృత్తివెన్ను,జూలై 23 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లి నందు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మరియు భారతీయ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ ల జయంతి సందర్భంగా గురువారం వారి చిత్రపటాలకు పాఠశాల ప్రధానోపాధ్యా యుడు టీవీ ప్రసాదు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్యప్రకాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్ భారత స్వాతంత్రోద్యమంలో అతివాదులుగా పేరుగాంచిన లాల్ బాల్ పాల్ త్రయంలో ఒకరిని మహాత్మా గాంధీ కంటే ముందు భారత స్వాతంత్ర పోరాటంలో అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడు తిలక్ అని అన్నారు. 1921లో సహాయ నిరాకరణ ఉద్యమం లో 14 ఏళ్ల వయసులో అరెస్టయి నప్పుడు న్యాయమూర్తి చిరునామా అడగగా తన పేరు అజాద్ అని తండ్రి పేరు స్వాతంత్ర్యమని నివాసం జైలు అని ధైర్యంగా సమాధానం ఇచ్చిన స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని భగత్ సింగ్ రాజ్ గురు వంటి వీరులతో కలిసి హిందుస్థాన్ సోషలిస్ట్ అసోసియేషన్ ను బలోపేతం చేశారని ఫిబ్రవరి 27 1931 అలహాబాద్ లోని ఆల్ఫ్రెడ్ పార్క్ లో ఉండగా పోలీసులు చుట్టుముట్టినప్పుడు బ్రిటిష్ వారి చేతిలో చిక్క కూడదనే ఉద్దేశంతో తనను తానే కాల్చుకుని వీరమరణం పొందిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మండల టిడిపి అధ్యక్షుడు రాగిడి చెన్నకేశవరావు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ రఘునాథస్వామి ఆలయంలో స్వర్ణ బాలరాముడి దివ్య విగ్రహ శోభాయాత్ర... భక్తుల విశేష దర్శనం





**నూజివీడు,జూలై 23 (వార్తాప్రభ) :** అయోధ్యలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న శ్రీ కళ్యాణ రామ దేవాలయం నిర్వాహకులు చల్లా శ్రీనివాస్ శాస్త్రి ఆధ్వర్యంలో... ఆ ఆలయంలో ప్రతిష్టించనున్న స్వర్ణ బలరాముని దివ్య విగ్రహం, స్వర్ణ పాదుకలు, స్వర్ణ విల్లుతో పాటు స్వర్ణ బాణాల దర్శన భాగ్యం నూజివీడు మండలం, గొల్లపల్లి పరిసర ప్రాంత ప్రజలకు లభించింది. గురువారం ఉదయం మచిలీపట్నం – కల్లూరు జాతీయ రహదారి వద్దకు చేరుకున్న ఈ దివ్య స్వర్ణ విగ్రహాలకు శ్రీ రఘునాథస్వామి వార్ల దేవస్థానం అధికారులు, అర్చక స్వాములు, పాలక మండలి చైర్మన్ దంపతులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు వందలాది మంది భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధులు, ఆలయ మాడ వీధుల గుండా వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న స్వర్ణ విగ్రహాలకు పాలక మండలి చైర్మన్ దంపతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆలయంలోనికి తీసుకువెళ్లారు. సనాతన ధర్మం మరియు వేదోక్త సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వర్ణ బాలరాముని దివ్య మూర్తితో పాటు స్వర్ణ విల్లు, బాణం మరియు పాదుకల దర్శన భాగ్యం కల్పించారు. విశేష సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి అయోధ్య రాముని ఆశీస్సులు పొందారని గోగినేని శ్రీనివాస్ కుమార అప్పారావు తెలిపారు. ఈ పుణ్య కార్యక్రమంలో పాల్గొని, అన్ని విధాలుగా అండదండలు అందిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవాలయ కార్యనిర్వహణాధికారికి, పాలక మండలి చైర్మన్ దంపతులకు, సభ్యులకు, హైందవశక్తి భక్తులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మా సమస్యలు ఎవరు తీరుస్తారు.. ఎవరికి చెప్పుకోవాలి?

-ఆవేదన వ్యక్తం చేస్తున్న తిరువూరు ఆర్టీసీ కార్మికులు





**తిరువూరు,జూలై 23 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఆర్టీసీ డిపోలో పలు సమస్యలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆర్టీసీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బస్సులకు సరైన హెడ్‌లైట్లు లేకపోవడంతో డ్రైవర్లు తమ సొంత డబ్బులతో హెడ్‌లైట్లు కొనుగోలు చేసి అమర్చుకుని విధులు నిర్వహిస్తున్నారని వారు చెబుతున్నారు. అలాగే, డిపో మేనేజర్ (డీఎం)ను కలిసి తమ సమస్యలు వివరించేందుకు రెండు, మూడు రోజులు ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ దొరకడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. డీఎం విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ఎప్పుడు డ్యూటీలో ఉంటారో కూడా తెలియని పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. "మా సమస్యలు ఎవరు తీరుస్తారు? మా గోడును ఎవరికి చెప్పుకోవాలి?" అంటూ ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, సంబంధిత అధికారుల పనితీరుపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని మరియు ఉన్నతాధికారులను కోరుతున్నారు. మైలేజీ రావట్లేదని ఆన్ కాల్ డ్యూటీ డ్రైవర్ డ్రైవర్స్ ని ఆపిన ఆర్టీసీ డిఎం డ్యూటీ ఆపితే కుటుంబ పోషణ భారం అవుతుందని వాపోతున్న ప్రవేటు డ్రైవర్స్ మాకు మరల డ్యూటీ ఇవ్వాలని వారి ఆవేదన

# నిరుపేద కుటుంబాలకు మానవత చేయూత

- దినకర్మల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం



**హనుమాన్ జంక్షన్,జూలై 23 (వార్తాప్రభ) :** మానవత హనుమాన్ జంక్షన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రెండు నిరుపేద కుటుంబాలకు దినకర్మల నిర్వహణ కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ సహాయాన్ని అందించారు. బాపులపాడు గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరావు కుమార్తె మృతిచెందడంతో వారి కుటుంబానికి, హనుమాన్ నగర్‌కు చెందిన షేక్ పఠాన్ ఖాన్ మృతిచెందడంతో వారి కుటుంబానికి దినకర్మల నిర్వహణ కోసం రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మానవత హనుమాన్ జంక్షన్ సంస్థ అందించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం మానవత సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తమ వంతు సహాయ సహకారాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు మానవత సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

# గవర్నమెంట్ ఐటిఐ లో 'రెండో' విడత కౌన్సెలింగ్

**గుడివాడ,జూలై 23 (వార్తాప్రభ) :** ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వివిధ ట్రేడుల్లో మొదటి విడత కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి ఆన్లైన్లో దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ ఓ. మంజులా దేవి గురువారం తెలిపారు. 10/8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెండో విడత కౌన్సిలింగ్లలో ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ లలో చేరే అభ్యర్థులు ఈఋఎుఎఐఅంంఆశీఅం.ఖజూ.స్త్రశీజ.అఆ లో ఆగస్టు మూడో తేదీ లాగా దరఖాస్తు చేసుకోవచ్చు లేదా కాలేజీకి వచ్చి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు, నాలుగో తేదీన ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలను ఎంపిక చేసుకున్న కళాశాలకు తీసుకువెళ్లి పరిశీలన చేయించుకోవాలని సూచించారు. వివరాలకు హెల్ప్ లైన్ నెంబర్లను 08674-295953, 8297574757, 9492560157 సంప్రదించవచ్చని తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి -- ఎమ్మెల్యే బోడె ప్రసాద్



**కంకిపాడు,జూలై 23 (వార్తాప్రభ) :** విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొననున్న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టిన ఏర్పాట్లను మంత్రి లోకేష్ బృందంతో కలిసి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నేడు పరిశీలించారు. కార్యక్రమం నిర్వహించనున్న పునాదిపాడు లోని కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి అనంతరం అయ్యానా కన్వెన్షన్ వేదికను పరిశీలించారు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యా రంగ పురోగతికి మంత్రి నారా లోకేష్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమై నియోజకవర్గ అభివృద్ధికి నాంది పలికే చారిత్రాత్మక వేడుకగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎస్.ఐ.ఆర్. ఎన్యూమరేషన్ పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

**-బూత్ ఇంచార్జి లకు ఎమ్మెల్యే గాంధీ సూచన**



**శేరిలింగంపల్లి,జూలై 23 (వార్తాప్రభ):**సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే--ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్‌ను పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలని బూత్ ఇన్‌చార్జ్‌లకు సూచించారు.ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా వివరాలు నమోదు చేయాలని,సర్వే ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు జరుగుతుందని తెలిపారు.మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ,శేరిలింగంపల్లి డివిజన్‌లోని అన్ని బూత్‌లలో ఎన్యుమరేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా పూర్తి సహకారం అందిస్తున్నామని చెప్పారు. ప్రజలంతా సర్వే సిబ్బందికి సహకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డివిజన్ నాయకులు,బూత్ ఇన్‌చార్జ్‌లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో... కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి ఖండించాలి.

**కేంద్ర విద్యా శాఖ మంత్రిని వెంటనే భర్త రఫ్ చేయండి.**
**చంద్రపూరి కాలనీ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్.**



**జవహర్ నగర్, జూలై 23 (వార్తా ప్రభ)** విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని ఖండించాలని, నీట్ పేపర్ లీకేజీ తో విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాట మాడుతుందని ఇప్పటికైనా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్తరఫ్ చేయాలని చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీతో పాటు తదితర నాయకులను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తూ ఏఐసీసీ పీసీసీ ఆదేశాల మేరకు గురువారం శ్రీకాంత్ యాదవ్, శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చె లగాట మాడుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని లేకపోతే ప్రధాని వెంటనే అతన్ని భర్త రఫ్ చేసి నీట్ పేపర్ లీకేజీకి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో యువత అభివృద్ధిలోనూ ముందు వరుసలో ఉందని దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర మరువలేమన్నారు అటువంటి విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాట మాడడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారంగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, జమాల్పూర్ నవీన్ కుమార్, బింగి సతీష్ గౌడ్, మాట్ల వినయ్ కుమార్, నాయకులు రజిత గోపాల్, గండి సునీత, బొబ్బిలి మంజుల, భాగ్య, సుగుణ, రేసు లక్ష్మి, సూరమ్మ, రాజు గౌడ్, సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణ, శ్రీనివాస్, గజ్వేల్ శంకర్, రాజు యాదవ్ ,మాధవరెడ్డి, పద్మారావు, మల్లికార్జున్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర తక్షణమే రాజీనామా చేయాలి

**-విద్యార్థి సంఘాల డిమాండ్**



**శేరిలింగంపల్లి,జూలై 23 (వార్తాప్రభ):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం మదీనాగూడ నుంచి చందానగర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి,రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ,ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులు,యువతపై లాఠీచార్జీ,బాష్పవాయువు ప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు.విద్యార్థి ఉద్యమాలపై దమనకాండను వెంటనే నిలిపివేయాలని, ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.న్యూఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి తేజ,ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు అరుణ్, గణేష్, దుర్గాప్రసాద్,ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయానికి రూ.40 లక్షలు!!

**● అద్భుతంగా ఆలయ నిర్మాణం ● ఆలయ నమూనా ఆవిష్కరణ ● ఆధ్యాత్మిక కేంద్రంగా పోచమ్మ ఆలయం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**





**పెద్దపల్లి , జూలై 23 (వార్తాప్రభ):**గోదావరిఖని పట్టణంలోని మెయిన్ చౌరస్తాలో వెలసిన పోచమ్మ తల్లి దేవాలయాన్ని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నూతన నిర్మాణానికి సంబంధించిన నమూనా చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.40 లక్షల నిధులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఆలయాన్ని ఆధునిక హంగులతో, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే అదనపు నిధులు కూడా సమకూర్చి పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. భక్తులకు విశాలమైన ప్రాంగణం, మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. పోచమ్మ తల్లి ఆలయం ఈ ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత గుర్తింపు పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ అభివృద్ధితో భక్తులకు ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించబడుతుందని అన్నారు. ఆలయ నిర్మాణంలో ప్రతి అంశాన్ని నిపుణుల పర్యవేక్షణలో చేపట్టి, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పనులకు స్పీడ్!!

**● అభివృద్ధి వేగవంతం చేయాలి ● షాపింగ్ కాంప్లెక్స్ త్వరగా పూర్తి చేయండి ● ప్రజా అవసరాలే ప్రాధాన్యం ● ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కీలక ఆదేశాలు**



**పెద్దపల్లి జూలై 23 (వార్తాప్రభ):**సింగరేణి అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. గురువారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పనులు పూర్తయ్యే వెంటనే సంబంధిత ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేసి రాకపోకలకు అనుకూలంగా మార్చాలని సూచించారు. సింగరేణి ఖాళీ క్వార్టర్ల పరిసరాల్లో పెరిగిన చెట్లు, పొదలను తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని, ఖాళీ క్వార్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారకుండా నిరంతర పర్యవేక్షణతో భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల భద్రత, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సింగరేణి పరిధిలో చేపట్టాల్సిన ప్రతి అభివృద్ధి పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, ప్రజా ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్‌తో పాటు సింగరేణి వివిధ విభాగాల అధికారులు పాల్గొని చేపడుతున్న పనుల పురోగతిని వివరించారు. అధికారులు సూచనలను అమలు చేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

# రాహుల్ ప్రజాస్వామ్య ద్రోహి!!

**● విద్యార్థులను రెచ్చగొడుతున్న పిరికిపంద ● నీట్‌పై కాంగ్రెస్ రాజకీయం..మోదీ స్పందించినా విద్యార్థులతో డ్రామా ● కందుల సంధ్యారాణి**





**పెద్దపల్లి జూలై 23 (వార్తాప్రభ):**ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించకుండా దేశంలో అశాంతి సృష్టించే ప్రయత్నాలు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి విమర్శించారు. ఈ మేరకు గురువారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత కలిగిన నాయకుడిగా వ్యవహరించకుండా, ప్రజలను, విద్యార్థులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించిందని, అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసం విద్యార్థులను వీధుల్లోకి తీసుకురావాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును రాజకీయాలకు వాడుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ఈ అంశంపై స్పందించి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారని చెప్పారు. అయినప్పటికీ వాస్తవాలను పక్కనపెట్టి దేశవ్యాప్తంగా ఆందోళనలు రెచ్చగొట్టడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అంశాన్ని చర్చించేందుకు పార్లమెంట్ అనే వేదిక ఉందని, నిజంగా ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే సభలో చర్చించాలని, వీధుల్లో రాజకీయ నాటకాలు ఆపాలని రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. దేశ ప్రయోజనాలు, విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకుని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీకి సూచించారు. దేశ ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలన కోరుకుంటున్నారని, అసత్య ప్రచారాలను నమ్మే పరిస్థితి లేదని కందుల సంధ్యారాణి ఘాటుగా వ్యాఖ్యానించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మెయిన్ రోడ్డుపై ఉన్న గేటు వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ క్రమంలో గోదావరిఖని 1వపట్టణ ఎస్హెచ్ఓ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో వారిని అరెస్టు చేసి స్టేషనుకు తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో భారతి, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ 50 వ జన్మదినోత్సవ సందర్భంగా "గిఫ్ట్ ఎ స్మైల్" కార్యక్రమం



**శేరిలింగంపల్లి,జూలై 23 (వార్తాప్రభ):**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని 'గిఫ్ట్ ఎ స్మైల్' కార్యక్రమంలో భాగంగా బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి చందానగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.మాజీ మినిమం వేజ్ బోర్డ్ చైర్మన్ సామ వెంకట్ రెడ్డి, బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వేముకుంట,శివాజీనగర్ బస్తీ, ఇందిరానగర్ బస్తీ తదితర ప్రాంతాల్లోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 600 మంది విద్యార్థులకు రూ.3 లక్షల విలువైన 5 వేల నోట్‌బుక్స్, 600 పెన్సిల్ బాక్సులు తదితర విద్యా సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పేద విద్యార్థులకు విద్యాభ్యాసంలో తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ శర్మ, రాజన్న, ఎం.డి.సలీం, చందర్‌రావు, నగేష్ రెడ్డి, ప్రమోద్, అంజి, శేఖర్, వంశీ రెడ్డి, రామారావు,అనంత్ రెడ్డి, శబానా,సునీత,శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అపన్న హస్తంగా నిలుస్తున్నది.

**-శాసనసభ్యులు అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,జూలై 23 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బాధితులకు అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు పత్రాలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆపన్నహస్తంగా నిలుస్తోందని, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్ కాలనీకి చెందిన ఎం.డి. షాబుద్దీన్‌కు రూ.1.25 లక్షలు, హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన శోభకు రూ.75 వేల చొప్పున మొత్తం రూ.2 లక్షల సీఎం సహాయ నిధి మంజూరైనట్లు వెల్లడించారు.వైద్య సహాయం అందించేందుకు కృషి చేసిన ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గణపతి, లియకత్, అష్రఫ్, రాజన్, యాసిన్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కులు సంక్షేమం కోసమే టిడబ్ల్యూజేఎఫ్.

**యూనియన్ లో చేరిన మేడ్చల్ కు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు**



**జవహర్ నగర్, జూలై 23:(వార్తా ప్రభ)**మేడ్చల్ నియోజకవర్గం బోడుప్పల్ సర్కిల్ సీనియర్ జర్నలిస్టు కలుకూరి ఎల్లయ్య, కాడిగల శ్రీకాంత్, జవహర్ నగర్ కు చెందిన ఆర్ సి శ్రీకాంత్ తో పాటు పలువురు జర్నలిస్టులు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) లో చేరారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకురాలు ఎస్ కె సలీమా చేతుల మీదుగా వారికి సభ్యత్వం ఇచ్చి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం గురువారం కాప్రా సర్కిల్ ఎస్ రావు నగర్ లో జరిగింది. జర్నలిస్టుల హక్కులు సంక్షేమం పట్ల ఫెడరేషన్ నిర్వహిస్తున్న ఉద్యమాల్లో భాగస్వాములు అయ్యేందుకే టిడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నామని ఈ సందర్భంగా ఎల్లయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్,మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు,జిల్లా నాయకులు సుధాకర్, చిక్కుడు నర్సింహ,అరుణ్ తదితరులు ఉన్నారు.

## స్వర్ణాంధ్రా డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో 26 న సదస్సు

**యాప్రాల్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ కన్వీనర్ ఎం.సాయికుమార్, చిందం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన 13 వ రోజు పాదయాత్ర.**

**డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, పాదయాత్రను ప్రారంభించిన సిఎంఎస్ జయ.**



**జవహర్ నగర్, జూలై 23:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ రాంకీ చెత్తడంపింగ్ యార్డు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ యాప్రాల్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి కన్వీనర్ ఎం.సాయికుమార్, గౌరవ సలహాదారులు చిందం శ్రీనివాస్ అధ్యక్షతన 13 వ రోజు పాదయాత్ర కార్యక్రమం జరిగింది. యయ2026, గురువారం రోజు, మల్కాజిగిరి, యాప్రాల్ బస్టాండ్ సెంటర్ లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, సిఎంఎస్ జయ పాదయాత్రను ప్రారంభించి, పలు పుర వీదుల గుండా కంపుగొట్టే జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగించాలని నినదిస్తూ పాదయాత్రను నిర్వహించారు. చట్టాలను, రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తున్న రాంకీ చెత్త డంపింగ్ యార్డు సుమారు 30 లక్షలమంది ప్రజల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ స్వర్ణాంధ్రా, యాప్రాల్, డిఎన్ఆర్ ఫంక్షన్లలో 26 న ఆదివారం రోజు జరిగే సదస్సును జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి చైర్మన్ షేక్ షావలి, యాప్రాల్ చైర్మన్ రాజానర్సింహ్మా ఈపై కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగిస్తూ ప్రజల ఆరోగ్యభద్రతను విస్మరించి, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ చెత్త డంపింగ్ తొలగింపు అవసరాన్ని గుర్తుచేశారు. వేలాదిమంది ప్రజలు డంపింగ్ వ్యతిరేక ఉద్యమంలో బాగస్వామ్యం అయితే తప్ప, డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదని గుర్తుచేశారు. గౌరవ సలహాదారులు, ఉపసర్పంచ్, ఆర్.నర్సింహ్మా గౌడ్, సిపిఐ తోటపల్లి శంకర్, సిపిఎం నగేష్, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, ఐ.ఎఫ్.టి.యు. పి శివబాబు, పికెఎం కొటేష్, టియుసిఐ వి.ప్రవీణ్, యాప్రాల్ పర్వతాలు, సిపిఐ నరేంద్రచారి, పిడిఎం చంద్రమౌళి, సీఎంసీ అల్లూరి సావిత్రి, జర్నలిస్ట్ కొన్నె వేణు, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, పిఓడబ్ల్యూ జయసుధ, ఫాతిమా, వి.స్వరూప, (సిపిఐ)శోభ, శ్రీలత, రత్న, హంసవేణి, ఎస్.కనకమ్మ, బీరకాయల బిక్షపతి తదితరులు ఈపై కార్యక్రమంలో పాల్గోన్నవారిలో ఉన్నారు.

# సంపాదకీయం

## అమరావతికి జగన్...ప్లాన్ ఏంటి ?

: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమరావతి రాజధాని పర్యటనకు రెడీ అవుతున్నారా అంటే ప్రచారం బట్టి చూస్తే అవును అనే అంటున్నారు. జగన్ ఉండేది తాడేపల్లిలోని తన నివాసంలో. అమరావతి కూడా దగ్గరలోనే ఉంది. ఇక జగన్ ఇపుడు ఎందుకు అక్కడకు వెళ్ళాలని అనుకుంటున్నారు అన్నదే పెద్ద చర్చ. పైగా అమరావతి వర్సెస్ మావిగన్ అని జగన్ ఇటీవల కాలంలోనే ఒక నినాదం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మా స్టాండ్ ఇదే అని మీడియా ముఖంగా కూడా ఓపెన్ స్టేట్మెంట్ ఇచ్చారు. ఇన్ని ఇచ్చిన తరువాత జగదచీశీఅవగన్ అమరావతి అని వెళ్ళడం వెనక వ్యూహమేంటి అన్న చర్చ సాగుతోంది. ఇదిలా ఉంటే అమరావతి వెళ్తే ఎలా ఉంటుంది అని జగన్ ఇటీవల తన పార్టీ నేతల సమావేశంలో ప్రస్తావించారు అని అంటున్నారు. ఇపుడే ఎందుకు అంటే ఇటీవల రాజధానిలో పంట భూములను దున్నేసి మరీ ప్రభుత్వం తీసుకుంది అన్న ఆరోపణలు వచ్చాయి. ఇక దానిని తట్టుకోలేక ఉండవల్లికి చెందిన రైతు పద్మనాభరెడ్డి గుండె పోటుతో మృతి చెందారు అని కూడా వార్తలు వెలువడ్డాయి. అంతే కాకుండా బలవంతపు భూసేకరణ మీద రైతాంగం ఆగ్రహంగా ఉందని కూడా ప్రచారం సాగుతోంది. వీటి నేపథ్యంలో జగన్ గుండెపోటుతో మరణించిన రైతు పద్మనాభం కుటుంబాన్ని పరామర్శించేందుకు అమరావతి టూర్ తొందరలో పెట్టుకోనున్నారు అని అంటున్నారు. దీని మీదనే పార్టీ నేతలతో ఆయన డిస్కస్ చేశారు అని అంటున్నారు ఇక చూస్తే కనుక ఈ మధ్యనే వైసీపీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు అంతా కలసి ఉండవల్లికి వెళ్ళి భూసేకరణ విషయంలో ఇబ్బంది పడుతున్న రైతులను పరామర్శించే కార్యక్రమం పెట్టుకున్నారు. అయితే వైసీపీ నేతలు అక్కడకి చేరుకున్న నేపథ్యంలో ఘర్షణ వాతావరణ నెలకొనడం టీడీపీ వర్సెస్ వైసీపీగా అది మారడంతో పెద్ద రచ్చ జరిగింది. ఆ మీదట రెండు వైపుల నుంచి కూడా కేసులు పెట్టుకోవడం జరిగింది. ఆ ఉద్రిక్తతలు అలా ఉండగానే ఇపుడు ఏకంగా వైసీపీ అధినేత జగన్ అమరావతి టూర్ అంటే మరింత ఉద్రిక్తతలు చోటు చేసుకుంటాయో అన్నది పోలీసులు ఆలోచిస్తారు అని అంటున్నారు. దీంతో జగన్ టూర్ కి అనుమతిస్తారా లేదా అన్న చర్చ కూడా సాగుతోంది. ఇదే సమయంలో జగన్ అమరావతి టూర్ చేస్తే బాగుంటుందని కొందరు నేతలు అంటున్నారు. రైతుల సమస్యలను తెలుసుకుని వారికి సంఘీభావం తెలపడం మంచి పరిణామంగా ఉంటుందని అంటున్నారు. అలాగే గుండె పోటుతో మృతి చెందిన పద్మనాభరెడ్డి కుటుంబాన్ని పరామర్శించడం మానవతా కోణంలో ఉంటుందని అంటున్నారు. మరి కొందరు అయితే మరోసారి ఉద్రిక్తతలకు ఈ పరిణామాలు దారి తీయవచ్చు కాబట్టి జగన్ కొన్నాళ్ళు ఆగితే బాగుంటుంది అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే జగన్ అమరావతి టూర్ మీద భిన్న స్వరాలు అయితే వైసీపీలో వినిపిస్తున్నాయని అంటున్నారు. మరి దీని మీద సరైన నిర్ణయం తీసుకోవాల్సింది వైసీపీ అధినాయకత్వమే అని అంటున్నారు. ఏది ఏమైనా అమరావతి విషయంలో వైసీపీ ఆలోచనలు ఏమిటి అన్నది అయితే చర్చగానే ఉంది. అమరావతి రైతుల పట్ల వైసీపీకి సానుభూతి ఉందని గట్టిగా చెప్పాలన్నదే ఆ పార్టీ ఆలోచన. అదే సమయంలో అమరావతి రాజధాని విషయంలో వైసీపీ స్టాండ్ ఇప్పటికే చెప్పేసింది అని అంటున్నారు. మరి రాజధానికి మద్దతు ఇవ్వకుండా ఈ తరహా పర్యటనలు పరామర్శలు చేయడం వల్ల ఏమైనా కొత్తగా ఒనగూడే ప్రయోజనం ఏమిటి అన్నదే అంతా చర్చిస్తున్నారు.

## వర్షాల కోసం ఆలయాల్లో వరుణ జపాల నిర్వహణ

**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులనేపథ్యంలో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలుసమృద్ధిగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలనిఆకాంక్షిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కీలక నిర్ణయంతీసుకుంది.దేవదాయశాఖ కమీషనర్ కె.రామచంద్ర మోహన్ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, వరుణ జపాలు నిర్వహించడానికి ఏర్పాట్లుజరుగుతున్నాయి.వరుణ సూక్త పారాయణలు, వరుణ గాయత్రీ జపాలు,రుద్రాభిషేకాలు, సహస్ర ఘటాభిషేకాలు అన్ని ఆలయాలలో నిర్వహించి సకాల వర్షాలవలన చెరువులు, జలాశయాలునిండి ప్రజలందరికీ శాంతి, ఐశ్వర్యాలు చేకూరాలని ప్రత్యేకపూజలు, స్థానిక ఆలయ ఆగమ సంప్రదాయాలకుఅనుగుణంగా, ఆగమ సలహా కమిటీల మార్గదర్శకత్వంలోకార్యనిర్వహణాధికారులు అన్ని ఆలయాలలో నిర్వహించాలని దేవదాయశాఖ ఆదేశించింది.

## ఏపీ దేవదాయ శాఖ నిధులపైదుష్ప్రచారాన్ని నమ్మవద్దు!

**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**'తల్లికి వందనం'పథకానికి ఆలయ నిధులు వినియోగిస్తున్నారనేవార్తలు పూర్తిగా అవాస్తవం!వాస్తవాలు : ఆలయ నిధుల మళ్ళింపు జరగలేదు, దేవదాయశాఖలేదా దేవాలయాల ఆదాయం, భక్తుల కానుకల నుండి ఒక్క రూపాయికూడా ఇతర పథకాలకు మళ్లించలేదు, ఆ విధంగా మళ్ళించటంజరుగదు.రాష్ట్ర బడ్జెట్ నిధులు మాత్రమే: 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైనబ్రాహ్మణ విద్యార్థులకు అందే లబ్ధి పూర్తిగా రాష్ట్ర ఆర్థికశాఖకేటాయించిన సాధారణ నిధుల నుంచే సమకూరుతోంది.సాధారణ పరిపాలనా ప్రక్రియ: బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్కుప్రభుత్వ సాధారణ బడ్జెట్ నిధులు దేవదాయశాఖ ద్వారా విడుదలఅవ్వడం కేవలం పరిపాలనా సౌలభ్యం మాత్రమే.ఆలయ నిధుల రక్షణ చట్టం (ఏ సి టి 30/1987) ప్రకారం దేవాలయాలఆదాయం, భక్తుల కానుకలు కేవలం ఆలయాల నిర్వహణ, అభివృద్ధి,నిత్య ధూపదీప నైవేద్యాలు, పురాతన ఆలయాల పునరుద్ధరణ, అర్చకులసంక్షేమం, ధార్మిక, వేద విద్యా ప్రోత్సాహానికి మాత్రమే ఖర్చుచేయబడుతున్నాయి.భక్తులకు విజ్ఞప్తి:రాష్ట్ర దేవదాయశాఖ చట్ట నిబంధనలను అత్యంత పారదర్శకంగాపాటిస్తోందని, ప్రచారంలో ఉన్న ఊహాజనిత వార్తలను, అపోహలనునమ్మవద్దని దేవదాయశాఖ స్పష్టం చేసింది.

### పెనుగంచిప్రోలు లో భారీగా పెరిగిన బియ్యం ధరలు



**పెనుగంచిప్రోలు, జూ లై 23( వార్త ప్రభ )** ఎల్ నినో పేరుతో పెనుగంచిప్రోలు లో నిత్య అవసరాల ధరలను పెంచినట్లు ప్రజలు చెపుతున్నారు బియ్యం క్విం టాకు రూ 400 నుంచి రూ 500 వరకు ( కిలోకు రూ. 4-5) పెంచారు.మార్కెట్ లో సోనా మ సూరి, బీ పి టీ వంటి రకాల 25 కిలోల బియ్యం బస్తా రూ. 15,50 నుంచి రూ. 1600 కీ చేరింది, బియ్యం తో పాటు పప్పులు, నూనె, ధరలు పెరిగి నట్లు వినియోగదారులు చెబుతున్నారు, రేటు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఈ ధరలు పెరుగుదలపై మహా కూటమి ప్రభుత్వం పేద వర్గాలను దృష్టిలో పెట్టుకో న్ని పెరిగిన ధరలపై ఒక నిర్ణయం తీసుకోవాలని బడుగు బల హిన వర్గాల ప్రజలు కోరుతున్నారు..

# నవమల్లెతీగ 100వ సంచికను ఆవిష్కరించిన మంత్రి సవిత

**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రెండు మూడు దశాబ్దాల క్రితం ఆంధ్రజ్యోతి, యువ, చందమామ వంటి పత్రికాసంస్థలు ప్రముఖ చిత్రకారుల ముఖచిత్రాలతో ఇలాంటి ప్రత్యేక సంచికలు వెలువరించేవని, నవమల్లెతీగ 100వ సంచిక చూస్తుంటే ఆనాటి జ్ఞాపకాలు మదిలో మెదులుతున్నాయని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామాత్యులు ఎస్. సవిత అన్నారు. గురువారం అమరావతి-సచివాలయంలోని మంత్రి పేషీలో నవమల్లెతీగ 100వ సంచికను మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ-ప్రింట్ పత్రికలు కనుమరుగవుతున్న నేటి కాలంలో ప్రత్యేక సంచికను తీసుకురావడం గొప్ప సాహసమన్నారు. సాహిత్యాన్ని ప్రధానంగా చేసుకుని సాహితీవేత్తలతో పాటు యువతను, మహిళలను అన్నిరకాల పాఠకుల్ని ఆకట్టుకునే విధంగా పత్రికను రూపొందిస్తున్న సీనియర్ సంపాదకులు కలిమిశ్రీ , ఆయనకు సహకరిస్తున్న ఎడిటోరియల్ బోర్డు సభ్యులు అభినందనీయులు అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



జి.ఆంజనేయులు, రాజధాని వార్తలు సంపాదకులు పఠాన్ హుస్సేన్ ఖాన్, సీనియర్ జర్నలిస్టులు చొప్పా రాఘవేంద్రశేఖర్, వై. డి. ఆనంద్ పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ పత్రాలు అందజేత

**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్. ఓ. సి ) లను జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్కూటమి నేతలతో కలిసి భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో బాధితులకు ఎల్ ఓ సీ పత్రాలను అందజేశారు...43 వ డివిజన్ ఊర్మిళ నగర్ చెందిన షేక్ నసీర్ (20) థైరాయిడ్ తో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 2 లక్షల 77 వేల ఎల్ ఓ సీ ను అందజేశారు.. 44 వ డివిజన్ సితార సెంటర్ కు చెందిన రాచకొండ గోపి (39) హెర్నియాతో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 1 లక్ష 80 వేల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు..అదేవిధంగా 41 వ డివిజన్, రంగూన్ సాహెబ్ వీధికి చెందిన బీ గణేష్ (34) మో చేయికి గాయమవగా మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 5 లక్షల 51 వేల ఎల్ ఓ సీ ను



అందజేశారు..కూటమి నేతలు మోరబోయిన రాంబాబు, నందే విజయలక్ష్మి, కరిముల్లా, జయ బాలన్, పెదప్రోలు బాల సుబ్రమణ్యం, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు...

# శ్రీదేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో వైభవంగా ముగిసిన నవరాత్రోత్సవాలు

**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న సి వి ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువున తూర్పు వైపు వున్న శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో ఈ నెల 15 నుండి జరుగుతున్న శ్రీ ఆషాఢ (గుప్త) వారాహి నవరాత్రోత్సవాలు గురువారం తో ముగిశాయి. శక్తి పీఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కారుణా నంద నాథ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలు శ్రీదేవి కరుమారి అమ్మ వారి శక్తి పీఠంలో శ్రీ ఆషాఢ (గుప్త)



వారాహి నవరాత్రుల మహోత్సవంలి లో భాగంగా మహా పూర్ణా హుతిలి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పూర్ణాహుతి అనంతరం అమ్మవారి నగరోత్సవం లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. తదుపరి అమ్మవారికి వివిధ రకముల విశేష హారతులు తో అమ్మవారిని భక్తులు పూజించారు ఈ కార్యక్రమంలో చలవాది ప్రకాష్ దంపతులు, కొరగంజి ప్రభాకర్ రావు దంపతులు, చిన్ని శివరాములు దంపతులు, వేలాదిమంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బోర్ పంపు లో నీళ్లు కేవలం వాడుకకు మాత్రమే

**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం నగరంలోని అన్ని బోరు పంపులకు త్రాగునీరు కాదు అనే హెచ్చరిక స్టిక్కర్లను వీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది అతికించారు.విజయవాడ నగరపాలక సంస్థ శుద్ధి చేసి సరఫరా చేసే తాగునీటికి ప్రత్యామ్నాయంగా కొంతమంది ప్రజలు బోరు నీటిని కూడా తాగేందుకు వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బోరు నీటిని తాగడానికి కాకుండా ఇతర గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలని స్టిక్కర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, బోరు నీటిలో సాధారణంగా టీడీఎస్, హార్డ్నెస్ స్థాయిలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అది తాగడానికి అనుకూలం కాదని తెలిపారు. అటువంటి నీటిని తాగునీటిగా వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజలు తప్పనిసరిగా విజయవాడ నగరపాలక సంస్థ శుద్ధి చేసి సరఫరా చేసే తాగునీటినే వినియోగించాలని కమిషనర్ సూచించారు.



# వెహికల్ డిపోలో సి.ఎన్.టి.యు.సి అధ్యక్షుడిగా వెంకయ్య నియామకం




**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వెహికల్ డిపో సి ఎన్ టి యు సి నూతన యూనియన్ విభాగం ప్రారంభించడం జరిగింది.ఆ యూనియన్ కి అధ్యక్షుడిగా కలవకొల్లు వెంకయ్య,ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అందుకుగాను ఆయన స్నేహితులుసన్నిహితులు శ్రేయోభిలాషులు అయిన కార్పొరేషన్ వెహికల్ డిపో డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్ లు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా వెహికల్ డిపోలో ఎవరికీ ఏ సమస్య వచ్చినా ముందుండి ఆ సమస్యను పరిష్కరించి కార్మికులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా వెహికల్ డిపో డ్రైవర్లు, క్లీనర్లు,మెకానిక్ లు కోరారు. మరియు వెంకయ్యను నియమించినందుకు గొట్టుముక్కల రఘురామరాజు కి వెహికిల్ డిపో కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సామినేని ఉదయభాను నేతృత్వంలో జనసేన పార్టీ విజయవాడలో బలోపేతం అవుతుంది

**-ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు**

**విజయవాడలో జనసేన పార్టీ బలం ఉన్న ప్రతి చోట పోటీ చేస్తుంది ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**

**విజయవాడ, జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సామినేని ఉదయభాను నేతృత్వంలో జనసేన పార్టీ విజయవాడలో బలోపేతం అవుతుందనీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.విజయవాడ ఆర్ టీ సీ వర్క్ షాప్ రోడ్డు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో విజయవాడలోని 64 డివిజన్ల జనసేన పార్టీ అధ్యక్షులు మరియు పార్టీ ముఖ్య నాయకులు, నగర కమిటీ మరియు వీర మహిళలతో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు, ఎన్ టీ ఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాయకులను ఉద్దేశించి సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఖచ్చితంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు వెన్యూ కన్వెన్షన్ హాల్ లో విజయవాడ నగరంలో జనసేన పార్టీ బలోపేతం ...కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో



ఏ విధంగా ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం పార్టీ శ్రేణులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాసరావు, వంశీ కృష్ణా పాల్గొంటారు. కావున ఈ కార్యక్రమంలో విజయవాడ నగరంలో 64 డివిజన్లకు చెందిన జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. విజయవాడ జనసేన పార్టీకి బలం ఉన్న ప్రతి ఒక్క డివిజన్ లో జనసేన పార్టీ పోటీ చేసే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ మండలి రాజేష్, పార్టీ సమాచార సేకరణ కమిటీ కేంద్ర కార్యాలయ సభ్యులు పెనుగొండ సుబ్బారాయుడు, పార్టీ పీఏసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత, కృష్ణా పెన్నా రీజియన్ కోఆర్డినేటర్ రావి సౌజన్య, మాచవరం ఆంజనేయస్వామి ఆలయం చైర్మన్ సోడిశెట్టి కృష్ణ ప్రసాద్, సెంట్రల్ నియోజకవర్గ పీఏసీ వంశీకృష్ణ, సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, సెంట్రల్ ఆంధ్ర జోన్ కో కన్వీనర్ కొప్పిరెడ్డి సూర్య నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమం ఆఖరి రోజు నేడే...

**ఈ ఒక్కరోజు కూడా వదలకుండా ఓటర్లు గా మీ పేర్లు నమోదు చేసుకోండి**

**విజయవాడ జనసేన పార్టీ మైనార్టీ నాయకులు షేక్ గయాజుద్దీన్(ఐజా) పిలుపు**




**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఓటర్లు గా తమ తమ పేర్లు నమోదు చేసుకోడానికి ప్రభుత్వం ఇచ్చిన గడువును ఈ ఒక్క రోజును కూడా వదలకుండా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ నగర జనసేన పార్టీ మైనార్టీ నాయకులు షేక్ గాయాజుద్దీన్ ఐజా గ్రూపు చైర్మన్ (ఐజా) పిలుపునిచ్చారు. గురువారం ఉదయం భవానిపురంలోని తన జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు సర్ కార్యక్రమంలో బూత్ లెవిల్ బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లు నిర్విరామంగా పాటు పడ్డారని ఈ సందర్భంగా వారందరికీ ఐజా కృతజ్ఞతలుతెలిపారు. అలాగే చిరునామా మార్పులు చేర్పులు చేయడానికి తమ వివరాలు ఎప్పటికప్పుడు తెలిపిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సర్ కి అందించిన వివరాలు ప్రకారం అత్తవారింటికి వచ్చిన కొత్త కోడళ్ల కి సైతం తమ తమ ఓటు హక్కును వినిగించుకునే అవకాశాలు దక్కించుకొంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాలు పంచుకొన్న అధికారులకులకు,అనధికారులకు ఐజా ప్రజలు తరుపున ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్...

**ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్.**




**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.. పింఛన్లు , ఇళ్ల స్థలాలు, వైద్య సహాయం,ప్రభుత్వ పథకాలు,ఇతర స్థానిక సమస్యలకు సంబంధించిన అంశాల పై వినతులు స్వీకరించారు.. ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ముఖ్య లక్షమన్నారు .. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా ఎమ్మెల్యే కార్యాలయం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి చేరేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఎన్డీయే కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ ను పశ్చిమ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అడ్డూరి శ్రీరామ్ తెలిపారు...కూటమి నేతలు, బుదాల నంద కుమారి, పల్లెపోగు ప్రసాద్, పగడాల కృష్ణా, దాడి మురళి కృష్ణ, దనాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు...

## విద్యార్థుల్లో వర్షపు నీటి సంరక్షణపై అవగాహన...

**"క్యాచ్ ది రైన్" కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న వీఎంసీ**



**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు "క్యాచ్ ది రైన్" అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం పటమటలోని కేబీసీ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాముఖ్యత, ఇంకుడు గుంతలను ఎలా ఏర్పాటు చేయాలి, వర్షపు నీటిని ఎలా సేకరించి భూగర్భ జలాల్లోకి చేరేలా చేయాలి, భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలు వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను చైతన్యపరచాలని సూచించారు.ఈ సందర్భంగా 11 వ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులని, పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి సంరక్షణలో వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. "క్యాచ్ ది రైన్" కార్యక్రమం ద్వారా ప్రతి విద్యాసంస్థలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, సమాజంలో వర్షపు నీటి సంరక్షణపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, శానిటరీ సిబ్బంది, విద్యార్థినీ--విద్యార్థులు పాల్గొన్నారు.

## తాతయ్య నీతులు

ఆపద సమయంలో
ఆదుకున్న వారే !
దైవమే జగతిలో
వారి సాటి లేరే !
మన కనీస ధర్మము
చేయూత ఇవ్వడము
కలసిమెలసి బ్రతకడము
ఎంతైనా క్షేమము
పలకరింపు ప్రేమతో
అందాల నవ్వుతో
బలమే బంధాలకు
అవసరం బ్రతుకులకు
కోల్పోకు విలువలు
బ్రతుకగును ముక్కలు
నిలకడగా ఉండాలి



మాట్లాడే మాటలు

**-గద్వాల సోమన్న,**

ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# ఉపాధ్యాయుల చిరకాల ఆకాంక్ష నెరవేర్చిన ప్రభుత్వం

## - ఓపీఎస్ జీవోపై సంబరాలు

**చంద్రగిరి: జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధి నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) కిందకు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడాన్ని ఉపాధ్యాయులు హర్షాతిరేకంతో స్వాగతించారు. ఈ నిర్ణయాన్ని చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ గురువారం చంద్రగిరి మండల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దోర్నకంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. జగదీష్ మాట్లాడుతూ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు రెండు దశాబ్దాలుగా



ఎదురుచూస్తున్న న్యాయమైన డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఓపీఎస్ అమలుకు జీవో విడుదల చేయడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం వేలాది మంది ఉపాధ్యాయ కుటుంబాలకు ఆర్థిక భద్రతతో పాటు భవిష్యత్తుపై విశ్వాసాన్ని కల్పించిందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు భాస్కర్ నాయుడు, రెడ్డి వెంకటరమణ, రామిరెడ్డి, చెంచయ్య, అమర్నాథ్, ప్రసన్న కుమార్, నాదముని తదితరులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుపై దాడి అత్యంత అమానుషం

## దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

## ఎ.పి.ఎం.పి.ఎ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి సురేష్



**ఆత్మకూరు జులై 23 ( వార్తాప్రభ)** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు పాలెం వద్ద విధి నిర్వహణలో ఉన్న ఒక జర్నలిస్టుపై అక్రమ మట్టి తోలే వారు దాడి చేయడం అత్యంత దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏ.పి.ఎం.పి.ఎ) నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి సురేష్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. అక్రమంగా మట్టి తోలుతుండగా కొందరు గ్రామస్తులే అడ్డుకొని ఈ సమాచారాన్ని మీడియాకు సమాచారం ఇవ్వడంతో కొందరు అక్కడికి చేరుకున్నారు. రాజ్ న్యూస్ జర్నలిస్ట్ సురేష్ వీడియో తీస్తుండగా అక్రమంగా మట్టి తోలే వారు ఆ జర్నలిస్టు ఫోన్ లాక్కొని తీవ్రంగా దాడి చేశారు. ఈ సంఘటన అత్యంత దుర్మార్గమని విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై భౌతిక దాడులు చేయడం జర్నలిస్టు విధులకు ఆటంకం కలిగించడం అత్యంత అమానుషమని వారు పేర్కొన్నారు. సంఘటనపై వెంటనే పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్‌తో క్రీడా ప్రతిభకు వేదిక

## విజయవాడ పశ్చిమలో నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

## - 12 క్రీడాంశాల్లో 450 మంది క్రీడాకారుల సందడి



**విజయవాడ పశ్చిమ జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి):** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి యువతను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలను నిర్వహిస్తోందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్ ఆరేకపూడి రమణరావు తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ స్థాయి పోటీలను గురువారం గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీలు క్రీడాకారులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తొలి మెట్టుగా నిలుస్తాయని, ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ 12 క్రీడాంశాల్లో 450 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనడం క్రీడలపై పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి ఉచిత భోజనం, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. శాప్ డైరెక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ 17 ఏళ్లు దాటిన యువతలో అపారమైన శక్తి, సామర్థ్యం దాగి ఉంటుందని, వారిని క్రీడల వైపు మళ్లించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేర్చడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. అనంతరం ఆయన పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ ఎంఈవో సోమశేఖర నాయక్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి టి. శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లిఖార్జున రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ శాంతి సక్సేనా, శాప్ శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పట్టుదలతోనే లక్ష్యాలు సాధ్యం: డాక్టర్ టి. శ్రీనివాసు



**విజయవాడ పశ్చిమ జులై 23:(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని కేబీఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ టి. శ్రీనివాసు అన్నారు. మార్చి-2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర ప్రభుత్వ 'షైనింగ్ స్టార్' పురస్కారాలు పొందిన విద్యార్థులకు గురువారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులను ఉత్తమ ఫలితాల దిశగా తీర్చిదిద్దిన అధ్యాపకులను అభినందించారు. హిందూ హై స్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు యాజమాన్యం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్న కుంభ జ్యోతి (983), వి. ఎస్తేర్ (979), జి. బిల్వగోపాల్ (972), షేక్ సోహెల్ అహ్మద్ (965)లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ టి. విజయ్ బాబు, డాక్టర్ జి. కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, సీహెచ్. రవీంద్రనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# కీళ్లు, ఎముకల ఆరోగ్యంపై యువత ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి
- లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దువ్వాడలో ఉచిత వైద్య శిబిరం
- 150 మందికి పైగా వైద్య సేవలు





**దువ్వాడ (విశాఖపట్నం):జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సాంకేతిక రంగంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయడం సరికాదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత ముఖ్యంగా కీళ్లు, ఎముకల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమతుల్యమైన పౌష్టికాహారం, క్రమబద్ధమైన వ్యాయామంతో ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ మరియు లీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కోసం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది పాల్గొని వైద్య సేవలను పొందారు. శిబిరంలో పాల్గొన్న వారికి శరీర కొలతలు, చేతి పట్టు బలం, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), హిమోగ్లోబిన్ (హెచ్‌బీ), రాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్), రక్తపోటు (బీపీ), ఎముకల సాంద్రత (బీఎండీ), బాడీ కాంపోజిషన్ అనాలిసిస్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు, పోషకాహార నిపుణులు పరీక్షల నివేదికలను పరిశీలించి, ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు లీ ఫౌండేషన్ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యంగా యువతలో జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, వైద్యులు డాక్టర్ రావుబాబు, డాక్టర్ సాయిజా, న్యూట్రిషనిస్టు మాధురి క్రాంతి, జీఎన్‌ఎం భాగ్యలత, యోగా మాస్టర్ అఖిల్, లీ ఫార్మా లిమిటెడ్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే విజ్ఞాన్స్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అరుంధతి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ కె.వి. శ్రీరామ్ ప్రసాద్, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ ఎ. ప్రవీణ్ తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

# ఆదర్శ పాఠశాలలోనే అస్తవ్యస్త మధ్యాహ్న భోజనం

## - డీఈవో తనిఖీలో వెలుగుచూసిన నిర్లక్ష్యం





**చంద్రగిరి: జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా గుర్తింపు పొందిన చంద్రగిరి మండలం స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ఎ. రంగంపేట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో తీవ్ర నిర్లక్ష్యం బయటపడింది. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కేవీఎన్ కుమార్ గురువారం ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన పథకం అమలులో లోపాలు ఉండటంపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులను వివరణ కోరారు. ఎ. రంగంపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ సరిగా లేకపోవడంపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి ఆదర్శ పాఠశాలగా ప్రకటించిన విద్యాసంస్థలోనే ఇలాంటి పరిస్థితులు వెలుగుచూడడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆదర్శ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకపోతే, ఇతర ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలులో లోపాలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులతో పాటు పాఠశాల యాజమాన్యాలపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తనిఖీలో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని డీఈవో ఆదేశించారు.

# ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో జనని డైలాగ్స్ కార్యక్రమం

## -సంతాన సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఒయాసిస్ అకాడమీ ఏర్పాటు




**విజయవాడ, జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సంతానోత్పత్తి ఆరోగ్యం, ముందస్తు అవగాహన, సమాచారంతో కూడిన కుటుంబ నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఒయాసిస్ ఫెర్టిలిటీ 'జననీ డైలాగ్స్' తొలి ఎడిషన్‌ను నిర్వహించింది. 'ది పేరెంట్‌హుడ్ పారడాక్స్ బిల్డింగ్ ఎ ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఇండియా' అనే అంశంతో విజయవాడలో నిర్వహించిన ఈ వేదికలో ప్రజారోగ్యం, ప్రభుత్వ వ్యవస్థ, సైకాలజీ, శిశు సంక్షేమం, కార్పొరేట్ మానవ వనరుల నిర్వహణ, సంతానోత్పత్తి వైద్యం వంటి రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు. కుటుంబాలకు అనుకూలమైన భారతదేశాన్ని నిర్మించాలంటే ఏమి చేయాలి? అనే దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్న ప్రశ్నపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ చర్చా వేదిక ఒక జాతీయ స్థాయి సంభాషణలో భాగంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగాఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు , మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి. రావు, ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజినల్ మెడికల్ హెడ్ డాక్టర్ వెంకట సుజాత వెల్లంకి మాట్లాడుతూభారతదేశం కుటుంబాలను నిర్మించుకునే విధానంలో నిశ్శబ్దంగా కానీ గణనీయంగా వస్తున్న మార్పుపై చర్చలు కేంద్రీకరించబడ్డాయన్నారు. దేశం యొక్క మొత్తం సంతానోత్పత్తి రేటు (టిఎఫ్‌ఆర్) ఇప్పటికే జనాభా భర్తీ స్థాయి కంటే తక్కువగా ఉండటం ఆందోళనకరం అని చెప్పారు. ఈ జనాభా మార్పుకు ఆలస్యంగా జరుగుతున్న వివాహాల కంటే, విద్య, వృత్తి, ఆర్థిక భద్రత మరియు వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ దంపతులు ఉద్దేశపూర్వకంగా సంతానోత్పత్తిని వాయిదా వేయడమే ప్రధాన కారణమని వక్తలు అభిప్రాయపడ్డారు. జీవనశైలి మారుతున్న కొద్దీ, సంతానోత్పత్తి సామర్థ్యం మాత్రం తన సహజ క్రమంలోనే సాగుతుంది. ఈ కారణంగా సంతానోత్పత్తిపై అవగాహన, నివారణ ఆరోగ్య సంరక్షణ మరింత ముఖ్యమైనవిగా మారుతున్నాయి. సంతానలేమి సమస్యలకు దారితీసే అనేక కారకాలను నివారించవచ్చన్నది గమనార్హం అని చెప్పారు. మారుతున్న జీవిత ఆకాంక్షలకు, మారకుండా ఉన్న జీవసంబంధ వాస్తవాలకు మధ్య పెరుగుతున్న అంతరం పేరెంట్‌హుడ్ పారడాక్స్ (తల్లిదండ్రులు కావాలనే ఆకాంక్ష వాస్తవాల మధ్య వైరుధ్యం) ఈ చర్చలో ఒక ప్రధాన ఇతివృత్తంగా నిలిచింది. ఎవరి వ్యక్తిగత నిర్ణయాలనూ ప్రభావితం చేయడం తమ లక్ష్యం కాదని, కానీ సకాలంలో అవగాహన కల్పించడం, నివారణ సంరక్షణ ద్వారా తగిన సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ప్యానెలిస్టులు స్పష్టం చేశారు. తల్లిదండ్రులు కావడానికి అయ్యే ఆర్థిక వ్యయం (ఎకనామిక్స్ ఆఫ్ పేరెంట్‌హుడ్) గురించీ ఈ చర్చా వేదికలో విస్తృతంగా చర్చించారు. సంతానాన్ని పెంచేందుకు అయ్యే ఖర్చు, ఆర్థిక ప్రణాళిక, ప్రభుత్వ సహాయక విధానాలను వ్యక్తిగత భారంగా కాకుండా, కుటుంబ నిర్మాణానికి అవసరమైన కీలక తోడ్పాటుగా పరిగణించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

# బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ లకు ఘన నివాళి



**పెనుగంచిప్రోలు, జులై 23( వార్త ప్రభ ):** స్వరాజ్యం నా జన్మహక్కు, దానిని నేను సాధించి తీరుతాను అని నినదించిన బాల గంగాధర్ తిలక్ ను "లోకమాన్య" అని పిలిచేవారని ఎంపీపీ మార్కాపుడి గాంధీ అన్నారు. గురువారం పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయం లో బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ ల జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్ చంద్రశేఖర్ ఆజాద్ లు స్వతంత్ర ఉద్యమాన్ని మరో మెట్టుకు తీసుకెళ్లి స్వతంత్రం రావడానికి బాటలు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ. శ్రీను, వైస్ ఎంపీపీ గుంటుపల్లి శ్రీనివాస్, ఏవో సిద్ధారెడ్డి మరియు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు...

# పొగాకు ధరల సంక్షోభం పై రిలే నిరాహార దీక్షలు



**మర్రిపాడు జులై 23 (వార్తాప్రభ)** డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం వద్ద డీసీపల్లి పొగాకు రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పొగాకు ధరల సంక్షోభంపై రిలే నిరాహార దీక్షలు ప్రారంభమ య్యాయి. ఈ రిలే నిరాహార దీక్షలు 31వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా వైస్సార్సీపీ మండల కన్వీనర్ చెన్ను.వెంకటేశ్వర్లు రెడ్డి గారు మద్దతు తెలిపి ప్రసంగించారు. ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య వైస్సార్సీపీ రైతు సంఘం జిల్లా నాయకులు చంద్ర.నారాయణ స్వామి జిల్లా నాయకులు లక్కు ప్రసాద్ రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఘంటా లక్ష్మీపతి రైతు నాయకులు బోయపాటి సుబ్బారాయుడు బోయపాటి నాగేశ్వరరావు సుధాకర్ వీరయ్య ముప్పాళ్ల తిరుపతి సుబ్బారెడ్డి నరసింహారెడ్డి గంగినేని వెంకటేశ్వర్లు జి.తిరుపతి తదితర రైతు నాయకులు తిక్కవరం క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

# కోవిడ్ తో అప్రమత్తంగా ఉండండి



**ఆత్మకూరు జులై 23 (వార్తాప్రభ)** ప్రస్తుతం దేశంలో రాష్ట్రంలో కోవిడ్ మళ్ళీ కలకలం సృష్టిస్తున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి అవసరమైతే మాస్కులు ధరించాలని ఆత్మకూరు జిల్లా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ కిరణ్ సూచించారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రస్తుతం కోవిడ్ ముందస్తు జాగ్రత్తలు పాటించడంతో పాటు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోగులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.?కోవిడ్ ముందస్తు జాగ్రత్తలో భాగంగా ?ఆసుపత్రి పరిసరాల్లో ఓపీ విభాగాల్లో జాగ్రత్తలు అమలు చేస్తున్నామన్నారు ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులు తప్పనిసరిగా ఫేస్ మాస్క్ ధరించాలని తెలిపారు.?థర్మల్ స్క్రీనింగ్ మరియు శానిటైజేషన్ ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద శానిటైజర్లు అందుబాటులో ఉంచడం జరిగింది అన్నారు ఏం చేస్తున్నారు.?భౌతిక దూరం ఓపీ క్యూ లైన్లు వెయిటింగ్ హాళ్లలో సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు.?ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు కోవిడ్ లక్షణాలు జ్వరం జలుబు దగ్గు ఉన్నవారిని తనిఖీ చేయడానికి ప్రత్యేక ఫీవర్ క్లినిక్ మరియు ఐసోలేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆసుపత్రిలోనే కోవిడ్ మరియు వైరల్ పరీక్షలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో కోవిడ్ ప్రత్యేక నోడల్ ఆఫీసర్ శివకృష్ణ వైద్యశాల వైస్ చైర్మన్ శ్రీరాములు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీ అధ్యక్షునికి ఘన సన్మానం



**మర్రిపాడు జులై 23 (వార్తాప్రభ)** మర్రిపాడు మండలం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ మండల అధ్యక్షులు ఆర్ల శ్రీనివాసుని ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రఘు నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎన్ జయశ్రీ సిహెచ్ నాగమణిలు శాలువాతో సన్మానించారు అనంతరం వచ్చిన ప్రజలు కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు గ్రామాలలో ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీని బలోపేతం చేసేందుకు మండల కమిటీ ప్రతిష్టంగా అమలు చేయాలని అన్ని గ్రామాలలో ఎస్సీ ఎస్టీల సమస్యలను సేకరించాలని ప్రజల పడుతున్న ఇబ్బందులను గుర్తించి అధికారులు దృష్టికి తీసుకురావాలని నిరంతరం ప్రజల సమస్యలతో పోరాడితేనే తప్ప సమస్యలు పరిష్కార దిశగా సాగవని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అలజడులు దృష్టిలో ఉంచుకొని ఎక్కువగా దళితులపై జరుగుతున్న దాడులు స్త్రీలపై జరుగుతున్న దాడులు భూ సమస్యలు దారి సమస్యలు గృహ సమస్యలు భూ సమస్యలు పై దృష్టి సారించాలని తెలిపారు.

# ప్రజా వాణిలో చేసిన ఫిర్యాదుకు స్పందించిన ఆర్టీసి అధికారులు



**పెనుగంచిప్రోలు, జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెనుగంచిప్రోలు లో శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్దకు శుక్రవారం, మరియు ఆదివారాలలో కూడా ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ గత సోమవారం ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు ట్రాఫిక్ కంట్రోలర్ బుద్ధావరపు శ్రీనివాసరావు, పొన్నం శ్రీనివాసరావు గురువారం పెనుగంచిప్రోలు గ్రామానికి వచ్చి ఫిర్యాదుదారులైన సహకార సంఘ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, విజయవాడ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నలుమూలు వెంకట శివరామ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాడపునేని సత్యంబాబుతో చర్చించారు. అనంతరం స్థానిక ఎస్సై ఎంఎస్కే అర్జున్ కలిసి సమస్యను వివరించేందుకు వెళ్ళగా ఆయన అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం కలిసి మాట్లాడతామని వారు తెలిపారు.

# యువత మీద కేసులు పెట్టొద్దు

**కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి**
**జిల్లా న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మహేష్ గడిపెల్లి**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)కొత్తగూడెం లీగల్: నీట్ పరీక్ష పత్రం లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని,విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడిపెల్లి మహేశ్ డిమాండ్ చేశారు.ఢిల్లీలో నీట్ విద్యార్థుల పై పోలీస్ చర్యను ఖండిస్తూ న్యాయవాదులు గురువారం సంఘ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు... ఈ సమావేశంలో సభ్యులు ముక్తకంఠంతో ఢిల్లీ పోలీసుల చర్యను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో పోస్టాఫీసు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలపాలని సమావేశంలో తీర్మానించారు.అనంతరం ర్యాలీగా పోస్టాఫీసు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన తెలియజేసారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మహేష్ గడి పెల్లి... మాట్లాడుతు ఢిల్లీలో నీట్ విద్యార్థుల పై పోలీస్ చర్యను ఖండిచారు.నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీ చార్జ్ దారుణమన్నారు.నిరసన తెలియజేయడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని,ఈ దేశ యువతకు విద్య, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ప్రభుత్వం బాధ్యతను విస్మరించినప్పుడు ఇలాంటి ఉద్యమాలే జరుగుతాయని,నిరసన తెలుపుతున్న విద్యార్థులకు దేశ నలుమూలల నుంచి ఆహార పదార్థాలను పంపి దేశ ప్రజలు వారి నిరసనకు మద్దతు తెలియజేశారని ప్రభుత్వం గమనించి వారి డిమాండ్లను నెరవేర్చాలని, కేంద్రం ఒకవైపు సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటిస్తూనే మరోవైపు పోలీసులను ఉసిగొల్పడం సరైన విధానం కాదన్నారు.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయదాదులు శివరామ్ ప్రసాద్,రమేష్ కుమార్ మక్కడ్,కె.పుల్లయ్య,కోటం రాజు,ఉపేందర్,జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇళ్ల మధ్యలో సబ్‌స్టేషన్ నిర్మాణం తీవ్ర వివాదం.

**కోర్టు కేసులు కొనసాగుతున్న భూమిలో పనులు చేపట్టడం చట్టవిరుద్ధం: భావనాఋషి సొసైటీ.**
**ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు.. వెంటనే పనులు నిలిపివేయాలి: అధ్యక్షుడు సీత ఆంజనేయులు హెచ్చరిక**





కాప్రా, జులై 23: (వార్తా ప్రభ)కాప్రా సర్కిల్ పరిధిలోని భావనాఋషి కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పరిధిలో ప్రతిపాదిత విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం తీవ్ర వివాదానికి దారితీసింది. కోర్టు కేసులు కొనసాగుతున్న స్థలంలో అధికారుల తొందరపాటు చర్యలపై సొసైటీ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు భావనాఋషి కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు సీత ఆంజనేయులు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొసైటీకి చెందిన సర్వే నంబర్--158లోని 2.10 గుంటల భూమికి సంబంధించి 2001 సంవత్సరం నుంచి సాయిబాబా వెల్ఫేర్ అసోసియేషన్, రెవెన్యూ శాఖల మధ్య వివిధ కోర్టుల్లో కేసులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడం చట్టాన్ని ధిక్కరించడమేనని ఆరోపించారు. సదరు భూమి 2009లో జీహెచ్ఎంసీ ఆమోదించిన లే-అవుట్ ప్రకారం భావనాఋషి సొసైటీ పరిధిలోనే ఉందని, ఆ భూమిపై తమకే హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గతంలో కాప్రా తహసీల్దార్‌గా పనిచేసిన అధికారి తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారని, తమపై ఒత్తిడి తెచ్చి అక్రమ డిమాండ్లు చేసినప్పటికీ తాము వాటికి లొంగలేదని ఆరోపించారు. అనంతరం చట్టవిరుద్ధంగా "710" బోర్డు ఏర్పాటు చేసి భూమిని ప్రభుత్వ భూమిగా చూపించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఈ వివాదంపై తాము హైకోర్టును ఆశ్రయించగా, 2026 జనవరి 27న హైకోర్టు స్టేటస్ కో ఆర్డర్ జారీ చేసిందని, కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు వాటిని పూర్తిగా విస్మరించి జేసీబీలు, యంత్రాలతో నిర్మాణ పనులు ప్రారంభించడం న్యాయవ్యవస్థను అవమానించడమేనని అన్నారు. ఇప్పటికే రెండు దశాబ్దాలకు పైగా న్యాయస్థానాల్లో విచారణ కొనసాగుతున్న భూమిలో ప్రభుత్వ శాఖలు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కోర్టు తుది తీర్పు రాకముందే నిర్మాణ పనులు చేపట్టడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని ఆరోపించారు. రెండు నివాస కాలనీల మధ్యలో హై వోల్టేజ్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అని సీత ఆంజనేయులు మండిపడ్డారు. వేలాది కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతంలో భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశాలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రేపు ఏదైనా ట్రాన్స్‌ఫార్మర్ పేలుడు, అగ్ని ప్రమాదం లేదా సాంకేతిక లోపం జరిగి ప్రజల ప్రాణాలు, ఆస్తులు నష్టపోతే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారు? అని ఆయన నిలదీశారు. ప్రజల భద్రత కంటే అధికారుల తొందరపాటు నిర్ణయాలకే ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమన్నారు. రెవెన్యూ అధికారులు, తహసీల్దార్, జాయింట్ కలెక్టర్ ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని, ప్రజా ప్రయోజనాలను కాపాడాల్సిన అధికారులు ప్రజల జీవితాలతో ప్రయోగాలు చేయడం తగదని విమర్శించారు. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్న సమయంలో పనులు చేపట్టడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సొసైటీ తరఫున ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులకు ఆయన స్పష్టమైన హెచ్చరిక చేశారు. కోర్టు వివాదం పరిష్కారమయ్యే వరకు సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని, లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని, అవసరమైతే మరోసారి న్యాయపోరాటం కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సొసైటీ ప్రతినిధులు, సభ్యులు, కాలనీ వాసులు పాల్గొని సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వాన్ని వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.

# ముప్పిరితోటకు ఆర్టీసీ బస్సు!!

**● మహిళల కోరిక నెరవేర్పు ● హామీ నిలబెట్టిన ప్రజా ప్రభుత్వం ● ప్రజా హామీల అమలే ధ్యేయం ● విప్ చింతకుంట విజయ రమణరావు**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 23 (వార్తాప్రభ):పెద్దపల్లి నియోజకవర్గంలోని ముప్పిరితోట గ్రామ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గురువారం ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు డిపో మేనేజర్ కవితతో కలిసి గోదావరిఖని--ముప్పిరితోట--గర్రెపల్లి మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామ మహిళలు కోరిన బస్సు సౌకర్యాన్ని అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రజా నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు గతంలో ఎలాంటి ప్రయత్నాలు జరగలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి 2024 డిసెంబరులో డిపో ఏర్పాటుకు ప్రకటన చేయించామని తెలిపారు. మరో రెండు నెలల్లో దేవీ నవరాత్రుల సందర్భంగా పెద్దపల్లి ఆర్టీసీ డిపోను ప్రారంభించి ప్రజలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందిస్తామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాటను తప్పబోమని, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రూ.12 కోట్ల వ్యయంతో ముప్పిరితోట మీదుగా నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను రెండు నెలల్లో పూర్తి చేయిస్తామని వెల్లడించారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను అందించడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆటోవాలా 'ఆయుష్షు రేఖ' విహెచ్ఆర్!!

**● ఆటోవాలా కంటక నీరు తుడిచిన హరీష్ రెడ్డి ● స్టీరింగ్ పట్టిన చేతులకు కొండంత అండ ● 42 కుటుంబాల్లో వెలిగిన కొత్త కాంతులు ● 'గిఫ్ట్ ఏ స్మైల్'తో ఆటో కార్మికులకు మహా చేయూత ● మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డిని ఏమనాలి? ● నాటి కేసీఆర్ వెలుగుల పాలన ● నేటి రేవంత్ కటిక చీకట్ల ప్రజా పాలన ● మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజం ● శ్రమదోపిడీ కాదిది... శ్రమకు గౌరవం ● ఆటో రంగానికి తక్షణమే ఈఎస్ఐ వర్తింపజేయాలి-కౌశిక హరి**






పెద్దపల్లి జూలై 23 (వార్తాప్రభ):పొద్దున్నే లేస్తే ఆటో స్టార్ట్ కావాలి... రోజు గడవాలంటే నాలుగు గిరాకీలు దొరకాలి. కానీ, నేడు ఆటో కార్మికుడి బతుకు చిత్రపటం మారిపోయింది. రోడ్డుపై గంటల తరబడి వేచి చూసినా దొరకని గిరాకీలు, పెరిగిన సంసార భారం... ఇదీ నేటి ఆటోవాలా దయనీయ స్థితి.అలాంటి వేళ... కష్టాల్లో ఉన్న ఆటో కార్మికుడి కంట నీరు తుడిచేందుకు 'విహెచ్ఆర్ ఫౌండేషన్' ముందుకు వచ్చింది.కెటిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆపన్న హస్తం అందించారు. 42 మంది నిరుపేద ఆటో కార్మికులకు రూ.4 లక్షల 20 వేలు తలా 10 వేలు ఆర్థిక సహాయం అందించి, వారి ముఖాల్లో మళ్లీ చిరునవ్వులు పూయించారు.

**"మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డిని ఏమనాలి?" - వ్యాళ్ళ హరీష్ రెడ్డి** కార్యక్రమంలో విహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత వ్యాళ్ల హరీష్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వాలు అంటే ప్రజల కష్టాలు తీర్చేవిగా ఉండాలి గానీ, కష్టాలను పెంచేలా ఉండకూడదు. రాష్ట్రంలో ఏకంగా 7.5 లక్షల ఆటో కుటుంబాలు ఈనాడు గిరాకీలు లేక, బతుకు బండి సాగక నరకం చూస్తున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డిని ఇప్పుడు ఏమనాలి? ఆటో కార్మికులకు మేమున్నామంటూ అండగా నిలవడమే కేటీఆర్ కి మేమిచ్చే నిజమైన బహుమానం.

**"కేసీఆర్ పాలనలో నిశ్చింత... నేడు కష్టాల వేదన" -- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**
ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాటి కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజలకు, కార్మికులకు అసలు కష్టమంటే ఏంటో తెలియదు. ప్రతి ఇల్లు నిశ్చింతగా ఉండేది. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రతి కార్మికుడూ వేదన అనుభవిస్తున్నాడు. ఆటో నడిపితే గానీ ఇంట్లో పొయ్యి వెలగని పరిస్థితిలో, వారి శ్రమను, ఆకలి కేకలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం.

**ఆటో కార్మికులకు ఈఎస్ఐ లబ్ధి చేకూర్చాలి- కౌశిక హరి** నాయకుడు కౌశిక హరి మాట్లాడుతూ... నిరంతరం రోడ్లపై తిరిగే ఆటో కార్మికులకు ఆరోగ్య భద్రత అత్యంత అవసరమని, వారికి సైతం తక్షణమే ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**ఆటో కార్మికుల ముఖాల్లో ఆనందం**స్టీరింగ్ పట్టి బతుకుపోరాటం చేస్తున్న ఆటోవాలాల ఆశల రేఖగా మారిన విహెచ్ఆర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమంపై స్థానిక ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. "ప్రభుత్వాలు మమ్మల్ని మరిచినా... మమ్మల్ని ఆదుకోవడానికి హరీష్ రెడ్డి ముందుకొచ్చారు" అని పలువురు ఆటో కార్మికులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ మహా సేవా కార్యక్రమంలో పలువురు నాయకులు మిరియాల రాజిరెడ్డి, మూల విజయ రెడ్డి, జాహిద్ పాషా, వంశీ కృష్ణ, కార్పొరేటర్లు సమ్మయ్య, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ఏ.యు.లో ప్రారంభమైన నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ సామర్థ్య పెంపుదల కార్యక్రమం



విశాఖపట్నం(పి.ఐ.బి.),జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ (ఎన్ ఎం ఎల్) ఆధ్వర్యంలో పబ్లిక్ లైబ్రరీ సిబ్బంది కోసం నిర్వహిస్తున్న 56వ సామర్థ్య పెంపుదల కార్యక్రమం, ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం సహకారంతో జులై 23, 2026న విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం జులై 27, 2026 వరకు కొనసాగుతుంది.ఈ సందర్భంగా నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ ఫీల్డ్ అసిస్టెంట్ దీపాంజన్ ఛటర్జీ మాట్లాడుతూ.. 2014లో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎల్, మోడల్ లైబ్రరీలు, పబ్లిక్ లైబ్రరీల సర్వేలు, సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు మరియు ప్రస్తుతం 'ఇండియన్ కల్చర్ పోర్టల్'గా పిలువబడుతున్న 'నేషనల్ వర్చువల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా పబ్లిక్ లైబ్రరీ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు రెండు ఎన్ఎంఎల్ మోడల్ లైబ్రరీలు మంజూరు అయ్యాయని, అందులో భాగంగా రాజమహేంద్రవరంలోని శ్రీ గౌతమి ప్రాంతీయ గ్రంథాలయానికి రూ.87.00 లక్షలు, అమరావతిలోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీకి రూ.223.00 లక్షల మొత్తాన్ని మంజూరు చేసినట్లు వెల్లడించారు. పరిపాలనా, లాజిస్టిక్స్, ప్రణాళిక, బడ్జెట్ ప్రయోజనాల కోసం రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్‌కు నోడల్ సంస్థగా వ్యవహరిస్తుందని తెలిపారు. తమ ప్రసంగంలో, ఏయూ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ సమకాలీన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా పబ్లిక్ లైబ్రరీలను ఆధునీకరించాల్సిన అవసరాన్ని వివరించారు. కృత్రిమ మేధ సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఆవిష్కరణలకు, మెరుగైన ప్రజా సేవల అందజేతకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అభ్యాస ప్రక్రియ, సమాజ భాగస్వామ్యం, నిరంతర విద్యకు కేంద్రాలుగా పబ్లిక్ లైబ్రరీల మారుతున్న పాత్రను అభినందించారు. డిజిటల్ యుగంలో పఠన సంస్కృతిని పెంపొందించాల్సిన, పౌరులను ప్రామాణికమైన సమాచారం వైపు నడిపించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రంథాలయాల సంచాలకులు (డైరెక్టర్) ఎ. కృష్ణమోహన్ మాట్లాడుతూ.. వనరుల పరంగా ఆంధ్రప్రదేశ్‌లో అనేక పాత, సమృద్ధి కలిగిన గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పబ్లిక్ లైబ్రరీల అభ్యున్నతికి, పురోగతికి ఆర్థిక సాయం అందించినందుకు ఆయన ఆర్ఆర్ఆర్ఎల్ఎఫ్ కి ధన్యవాదాలు తెలిపారు.నేషనల్ నాలెడ్జ్ కమిషన్ సిఫార్సు మేరకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2014లో ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ యొక్క ప్రధాన భాగాలలో ఈ 'కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' ఒకటి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ లైబ్రరీ నిపుణులు, అలాగే కొందరు పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థులు కలిపి దాదాపు 86 మంది ప్రతినిధులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు.ఏయూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ ధనరాజు వీరమల్లు అతిథులకు, ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఇతర అతిథుల్లో నెహ్రూ యువ కేంద్ర మాజీ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.ఎస్. మనోరంజన్, ఏయూ గౌరవ ప్రొఫెసర్ డాక్టర్ సి. శశికళ పాల్గొన్నారు.

# మంత్రాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, జులై 23 :(వార్తా ప్రభ ప్రతినిధి) మంత్రాలయంలో శ్రీ గురు రాఘవేంద్ర స్వామి వారి బృందావనాన్ని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా మఠం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి బృందావనం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదపండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం మఠం అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

# తహసీల్దారును సన్మానించిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ



ఆత్మకూరు జులై 23 (వార్తాప్రభ) ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండల తహసీల్దారు అనిల్ కుమార్ యాదవ్ ను గురువారం ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు మరియు నెల్లూరు జిల్లా మాజీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కొప్పరు రఘు నెల్లూరు జిల్లా కమిటీ అధ్యక్షులు ఎన్ జయశ్రీ సిహెచ్ నాగమణి మండల అధ్యక్షులు ఆర్ల శ్రీనివాసులు మరియు ప్రజలు ఘన స్వాగతం పలికారు నూతనంగా ఎంపిక కాబడిన మర్రిపాడు మండల అధ్యక్షులు ఆర్ల శ్రీనివాసులు మరియు నాయకులు పరిచయవేదిక కార్యక్రమం నిర్వహించారుఅనంతరం తాసిల్దారును సాల్వాలతో సత్కరించారు రాష్ట్ర అధ్యక్షులు కొప్పోలు రఘు మండల అధ్యక్షుని పరిచయం చేస్తూ ప్రతి నెల చివరి శనివారం దళితవాడలో సివిల్ రైట్స్ నిర్వహించి వారి వద్ద సమస్యలు స్వీకరించి పరిష్కారదిశ ఉన్నతాధికారులకు నివేదిక పంపించి పరిష్కరించాలని కోరారు జస్టిస్ పునై కమిషన్ తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు చేరువ చేయాలని ఆ దిశగా అధికారులు పయనిస్తే దళితవాడలలో దళితుల సమస్యలు పరిష్కారం అవుతాయని కోరారు సివిల్ రైట్స్ డే రోజున అన్ని శాఖల అధికారులను ఒక వేదిక పైన తీసుకురావాలని అన్ని శాఖల సమన్వయంతో దళితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు అంతేకాక గ్రామాలలో భూ సమస్యలు తాగునీటి సమస్యలు రోడ్లు కాలనీలు చిన్నచిన్న వాగ్వాదాలుపరిష్కరించినప్పుడే గ్రామాలు సఖ్యతగా ఉండి అభివృద్ధి పథంలో నడుస్తాయని పేర్కొన్నారు.

# ఆంధ్ర రత్న భవనంపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ-బొర్రా కిరణ్

**గవర్నర్‌కు కాంగ్రెస్ నేతల వినతిపత్రం**
**రాహుల్, ఖర్గే, ప్రియాంక అరెస్టులను ఖండించిన కాంగ్రెస్**
**దాడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**




ఇబ్రహీంపట్నం, జులై 23(వార్తా ప్రభ ప్రతినిధి):విజయవాడ ఆంధ్రరత్న భవన్ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు, కొంతమంది కిరాయి గూండాలు దాడికి పాల్పడటం పిరికిపందల చర్యగా కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ అభివర్ణించారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఇబ్రహీంపట్నంలో బొర్రా కిరణ్ విలేకరులతో మాట్లాడారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఇంటి వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం అమానుషమన్నారు.వారి అరెస్టులను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేసి ఆంధ్రరత్న భవన్ కు చేరుకున్న కాంగ్రెస్ నేతలపై అధికార మదంతో మాధవ్ నాయకత్వంలో దాడులు చేయడం దుర్మార్గమన్నారు. బీజేపీ కార్యకర్తలు అల్లర్లు చేస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు యంత్రాంగం చూస్తూ ఉండటం బాధాకరమన్నారు. గవర్నర్ కు వినతిపత్రం సమర్పించిన వారిలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్ వలీ, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ కొలనుకొండ శివాజీ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇన్ చార్జి మీసాల రాజేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్కరాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానికి వ్యతిరేకంగా ఆందోళనల వెనుక పెద్ద కుట్ర

**- బీజేపీ కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి**



ఇబ్రహీంపట్నం, జూలై 23 (వార్తా ప్రభ ప్రతినిధి): ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు, ఆందోళనల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని బీజేపీ కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి అన్నారు. గురు వారం ఆమె ఇక్కడి విలే కరులతో మాట్లాడారు. దేశ అభివృద్ధి, భద్రత ప్రధాన లక్ష్యంగా ప్రధాని మోడీ పరిపాలన సాగుతుందని తెలిపారు. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా భారతీయులు సగర్వంగా తలెత్తుకుని జీవించేలా, ఏ లోటు లేకుండా చేస్తున్నారని చెప్పారు. అనేక సంక్షోభాలు ఎదురైనా దేశాన్ని ప్రగతి పథంలో పయనింపజేస్తూ, నక్సల్స్ రహిత భారత దేశంగా మలిచిన ప్రధాని మోదీ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. స్టార్టప్ లో యువత భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇస్తున్న మోడీ సర్కారు ప్రపంచంలో అత్యంత వేగంగా, సాంకేతిక అభివృద్ధి సాధిస్తున్న విషయం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆందోళనకారులను నడిపిస్తున్న కుట్రదారులపై వంచకులపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమైన నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని అభిప్రాయపడ్డారు. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ కాలంలో 18 సార్లు పేపర్ లీకేజీలు జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆ కుట్రదారులను ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గుడివాడ అభివృద్ధికి దాతల చేయూత.. కూటమి ప్రభుత్వం వెన్నుదన్ను : ఎమ్మెల్యే రాము

## ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో అన్నే దంపతులకు సన్మానం..



**గుడివాడ,జూలై 23 (వార్తాప్రభ) :** గుడివాడ అభివృద్ధికి కూటమి ప్రభుత్వ వెన్నుదన్నుతో పాటుగా.. దాతల చేయూత ఉండడం సంతోషకరమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ నూతన బస్టాండ్ అభివృద్ధికి రూ.3 కోట్ల విరాళంగా అందించిన అన్నే నరసింహారావు - పుష్పలీలావతి దంపతుల సన్మాన కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ "జన్మనిచ్చిన పిల్లలతో సమానంగా గుడివాడను ప్రేమించడం నాకు చాలా ఆనందంగా ఉందనీ, పెరిగిన సమాజానికి ప్రాధాన్యత ఇచ్చే ఈ దంపతులు నిండు నూరేళ్లు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని ఎమ్మెల్యే అన్నారు. ఏపీ ఎస్ డబ్ల్యూ సి చైర్మన్ రావి వెంకటేశ్వర్రావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పట్టణ ప్రముఖులు మాట్లాడుతూ, బాలాజీ థియేటర్ అధినేత అన్నే నరసింహారావు విద్యాభివృద్ధికి కృషి చేశారని, ఇప్పటికే వారు ఇచ్చిన రూ.3 కోట్ల విరాళంతో హాస్పిటల్ అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికల హామీ మేరకు దశాబ్దల బస్టాండ్ సమస్య పరిష్కారానికి పూనుకున్న ఎమ్మెల్యే రాము బస్ స్టాండ్ టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించారని, అవి ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. రాము కృషికి తోడ్పాటుగా అన్నే దంపతులు మరో రూ.3 కోట్ల చెక్కును అందించారని పేర్కొన్నారు. మంచి పాలకులు ఉంటే ఇలాంటి గొప్ప వ్యక్తులు మరింత ముందుకు వస్తారని నాయకులు ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తుమ్మల రాంప్రసాద్, కోగంటి ఆంజనేయులు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య,బిజెపి నాయకులు దావులూరి సురేంద్ర బాబు, ముళ్ళపూడి రమేష్ చౌదరి, చేకూరు జగన్మోహన్రావు, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, సత్యనారాయణపురం ప్రముఖులు పంచమర్తి శ్రీనివాసరావు, వల్లభనేని రత్నకుమార్, అట్లూరి కృష్ణ ప్రసాద్, వేమూరి ప్రతిమ, శ్రీనివాసరావు, దాసరి భాను ప్రసాద్, పలువురు పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, సత్యనారాయణపురం పెద్దలు పాల్గొన్నారు.

# హెచ్ఆర్ఎంఎస్ అమలుపై ప్రత్యేక దృష్టిపెట్టండి

- వీలైనంత త్వరగా పోర్టల్‌లో ఉద్యోగుల నమోదును పూర్తిచేయండి
- జిల్లా సహకార అభివృద్ధి, సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూలై 23 (వార్తాప్రభ) :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) మానవ వనరుల నిర్వహణ వ్యవస్థ (హెచ్ఆర్ఎంఎస్) అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని, పోర్టల్‌లో ఉద్యోగుల నమోదు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో జిల్లా సహకార అభివృద్ధి, సమన్వయ కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో హెచ్ఆర్ఎంఎస్ అమలు, ఎండ్ ఆఫ్ డే ప్రక్రియ పురోగతిని సమగ్రంగా సమీక్షించారు. హెచ్ఆర్ఎంఎస్ అమలు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య కార్యక్రమమని.. దీన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగులందరి వివరాలను హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో ఆలస్యం లేకుండా నమోదు చేయించాలని ఆదేశించారు. అవసరమైన సాంకేతికత, పరిపాలనా సహాయాన్ని సంఘాలకు అందించి, పెండింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా పీఏసీఎస్‌లలో ఎండ్ ఆఫ్ డే ప్రక్రియ పురోగతిని కూడా సమీక్షించి.. దీన్ని పూర్తిచేయకపోవడం వల్ల హెచ్ఆర్ఎంఎస్ అమలు, ఇతర డిజిటల్ కార్యక్రమాల అమలుపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. అందువల్ల పెండింగ్‌లో ఉన్న అన్ని సంఘాల్లో ఈవోడీ ప్రక్రియను అత్యవసర ప్రాధాన్యతతో వెంటనే పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి అధికారులు రోజువారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా సహకార అధికారి, కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ సీఈవో, ఇతర క్షేత్రస్థాయి అధికారులు పీఏసీఎస్ సీఈవోలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎన్.అజితకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా మత్స్య అధికారి సీహెచ్ సౌభాగ్య చక్రాణి, కేడీసీసీబీ, నాబార్డు తదితర విభాగాల ప్రతినిధులు హాజరయ్యారు.

# వైయస్సార్ సీపీ నేతల బర్త్‌డే వేడుకలపై పోలీసుల దాడి..!



**గుడివాడ,జూలై 23 (వార్తాప్రభ) :** పట్టణంలో వైయస్సార్ సీపీ యువ నాయకుడు మెరుగుమాల కాళి కోసం ఏర్పాటు చేసిన అర్ధరాత్రి పుట్టినరోజు వేడుకలు, శబ్ద కాలుష్యంపై స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసు మరియు ఎక్సైజ్ శాఖల దాడితో ముగిశాయి. అధికారులు అక్కడి నుండి భారీ మొత్తంలో మద్యం స్వాధీనం చేసుకుని, ఎక్సైజ్ నిబంధనల ఉల్లంఘనపై కేసు నమోదు చేశారు. ఈ వేడుక బుధవారం రాత్రి గుడివాడలోని టీచర్స్ కాలనీలో ఉన్న ఒక భవనం పై అంతస్తులో జరిగింది. పోలీసుల సమాచారం ప్రకారం, ఈ కార్యక్రమానికి సుమారు 100 మంది హాజరయ్యారు. ఇందులో పలువురు వైయస్సార్ సీపీ కార్యకర్తలు మరియు కొందరు రౌడీషీటర్లు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. మాజీ మంత్రి కొడాలి నాని ఫోటోను ప్రదర్శిస్తూ, కొందరు పాల్గొన్నవారు ఆయనకు మద్దతుగా నినాదాలు చేసినట్లు కూడా పోలీసులు పేర్కొన్నారు. అర్ధరాత్రి వేళ కలిగిన అంతరాయంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఈ దాడి జరిగింది. పోలీసులు ఎక్సైజ్ అధికారులతో కలిసి అక్కడికి చేరుకుని ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో, అధికారులు విదేశీ మద్యం సహా భారీ మొత్తంలో మద్యాన్ని గుర్తించారు. ఎక్సైజ్ శాఖ ప్రకారం, మద్యం సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి నిర్వాహకులు ఎటువంటి అనుమతి పొందలేదు. ఆ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత ఎక్సైజ్ నిబంధనల కింద కేసు నమోదు చేశారు. దీనిపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. మెరుగుమాల కాళిపై ఇప్పటికే రౌడీషీట్ నమోదై ఉందని పోలీసులు తెలిపారు. గుడివాడ లోని టీడీపీ కార్యాలయంపై దాడి చేశారన్న ఆరోపణలతో 2022లో నమోదైన కేసులో అతన్ని, అతని అనుచరులను గతంలో అరెస్టు చేశారు. ఈ తాజా ఘటన స్థానిక వైయస్సార్ సీపీ నాయకుల కార్యకలాపాలను మరోసారి చర్చనీయాంశం చేసింది ; పోలీసులు ఆరోపిత ఉల్లంఘనలపై దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# చిన గొల్లపాలెం దీవిలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**కృత్తివెన్ను,జూలై 23 (వార్తాప్రభ) :** చినగొల్లపాలెం దీవిలోని ప్రాథమిక పాఠశాల జానకిపురం ప్రాథమిక పాఠశాల ఏటి పవర్ ప్రాథమిక పాఠశాల సి పేట లోని విద్యార్థులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గోపిరెడ్డి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో గురువారం తన మిత్రుడైన గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్ ఆర్థిక సహాయంతో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా తన మిత్రుడు కుమార వెంకటేశ్వర వరప్రసాద్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నవదుర్గ భవాని ,దిలీప్ ,సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు మరియు గ్రామ పెద్దలు యాళ్ల పూర్ణచంద్రరావు, కొప్పినీడి తాతాజీ నాయక్, పువ్వాడ ముత్యాలరావు, తెలగంశెట్టి శ్రీనుబాబు, కరీం శెట్టి శేషారావు (చిన్నారి) తేలగం శెట్టి రాజబాబు బాబురావు తదితరులు పాల్గొని విద్యార్థులకు వారి చేతుల మీదుగా నోటు పుస్తకాలు అందజేశారు.

# నేడు విద్యుత్ అంతరాయం

**కృత్తివెన్ను,జూలై 23 (వార్తాప్రభ) :** శుక్రవారం నాడు 11కేవీ గరిశీ పూడి ఫీడర్ పాము వలన సరఫరా నిలిపివేయబడును. సమయం: ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 11:30గంటల వరకు . దీనీ వలన సీతనపల్లి బోలుగొంది మాట్లం పెన్నమదిబ్బ, గోవిందరాజుల దిబ్బ గ్రామాలకు అంతరాయం కలుగును. కావున వినియోగదారులు గమనించి సహకరించగలరు. జి గోవిందరావు ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు

# ఎరువుల షాపులు పరిశీలించిన మండల తాసిల్దార్ - కే లక్ష్మీ కళ్యాణి



**విస్సన్నపేట,జూలై 23 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో చశీద్రు పట్ల తెల్లదేవరపల్లి గ్రామాలలో ఎరువుల షాపులను మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ కొనుగోలు అమ్మకాలు తదితరాలను ప్రత్యక్షంగా ఆమె తనిఖీ చేశారు. రైతులను వారు కొనుగోలు చేస్తున్న ధరలను అడిగి తెలుసుకున్నారు.

# ప్రత్యేక అధికారులతో పెడన ఎంపీడీఓ సమావేశం




**పెడన,జూలై 23 (వార్తాప్రభ) :** పెడన మండల పరిషత్ అభివృద్ధి అధికారి కటకం శివప్రసాద్ ఆధ్వర్యంలో మండల పరిషత్ పరిధిలో పంచాయతీ ప్రత్యేక అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయటం జరిగినది. సదురు సమావేశము నందు ప్రత్యేక అధికారులు అధికారం చేపట్టినప్పటి నుండి జరిగిన ఖర్చు వనరులు వివరములపై చర్చించడం అయినది. పదవి చేపట్టినప్పటికీ ఉన్న ఆదాయము కంటే పదవి వదిలే నాటికి బ్యాలెన్స్ పెంచుటకు చర్యలు గైకొనవలసినదిగా కోరడమైనది. అదేవిధంగా పంచాయతీ నిధులు ముఖ్యంగా త్రాగునీరు వీధి దీపాలు,పారిశుద్యానికి కేటాయించ వలసిందిగా సూచించడమైనది. ప్రత్యేక అధికారులు వీలైనప్పుడు వారి వారి గ్రామం సందర్శించి సమస్యలు తెలుసుకొన వలసినదిగా కోరడమైనది. సదరు సమావేశాలకు హేమ్ ప్రకాష్ డిప్యూటీ ఎంపీడీవో ధర్మయ్య ఏఈ సజ్జ జెన్నీ ఏవో హాజరైనారు.

# కుక్కలు బాబోయ్ కుక్కలు.. !



**గుడివాడ,జూలై 23 (వార్తాప్రభ) :** పట్టణంలో వీధి కుక్కల బెడదా ఇంకా తగ్గలేదు.. పురపాలక సంఘం ఒక వైపు చర్యలు తీసుకుంటున్నా కూడా మరోవైపు జనాలపై దాడి చేస్తూ బేంబేలెత్తిస్తున్నాయి.. చిన్నా వృద్ధులు ముఖ్యంగా చిన్నారులు బయటకు రావాలంటే భయపడుతున్నారు.. ప్రస్తుతం జరిగిన ఘటనల వల్ల పట్టణం మరోసారి ఉలిక్కి పడింది.. ఇక తాజాగా పట్టణ శివారు లోని మల్లాయిపాలెం గ్రామ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో 'ఐరా' పై వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఈ క్రమంలో చిన్నారీ తలపై లోతుగా గాయమైంది. అలాగే ఇటీవలే పట్టణం లోని ఏలూరు రోడ్డు - బొమ్మరిల్లు థియేటర్ ఎదురు వీధిలో వృద్ధుడిపై కుక్కలు దాడి చేసాయి. ఇలా నిత్యం పట్టణంలో పరిసర గ్రామాలలో ఏదో ఒక చోట వీధి కుక్కల దాడిలో ప్రజలు గాయాల పాలవుతున్నారు. మొత్తంగా.. వీధి కుక్కల బెడదతో ప్రజలు ఇంకా భయ భ్రాంతులకు గురువుతున్నారు. ఎక్కడ నుంచి ఏ కుక్క వచ్చి దాడి చేస్తుందోనని ప్రాణాలు అరచేతితలో పెట్టుకుని రోడ్ల పైకి వస్తున్నారు. వీధి కుక్కల భీభత్సం పై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు ఇచ్చినా స్పందించడం లేదని పట్టణ ప్రజలు అగ్రహాం వ్యక్తం చేస్తున్నారు.

# కొత్త కాలనీ వాసుల సమస్యలకు తక్షణ పరిష్కారం..



**కృత్తివెన్ను,జూలై 23 (వార్తాప్రభ) :** కాగిత కృష్ణప్రసాద్‌కు ఘన స్వాగతం పలుకుతాం, కృతజ్ఞతలు తెలుపుతాం,రుణపడి ఉంటాం,గ్రామస్తులు... కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం యండపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కొత్త కాలనీలో విద్యుత్ స్తంభాలు, రోడ్డు సమస్యలకు స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ తక్షణమే స్పందించారు. 13 నూతన విద్యుత్ స్తంభాలు మంజూరు కొత్త కాలనీ వాసులు తమ ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో, ఆయన వెంటనే చర్యలు తీసుకున్నారు. కాలనీకి 13 నూతన విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించి వేయించారు. దీంతో కాలనీలో చీకట్లు తొలగి రాత్రి సమయంలో ప్రజలు, విద్యార్థులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలిగింది. రోడ్డు బాగు పనులు ప్రారంభం ఇటీవల కాలనీ వాసులు టిడిపి సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య తో కలిసి ఎం.ఎల్.ఎ కాగిత కృష్ణప్రసాద్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో కాలనీకి వచ్చే రోడ్డు అధ్వాన్నంగా ఉందని, విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని విన్నవించారు. ప్రజల సమస్యను తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే స్పందించి, మంగళవారం జెసిబి ను పంపి రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించారు. ప్రజల హర్షం తమ సమస్యను చెప్పిన వెంటనే పరిష్కారం చూపిన ఎంఎల్ఏ కాగిత కృష్ణప్రసాద్‌కు కాలనీ వాసులు మరోమారు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు పనులను కూటమి నాయకులు దగ్గరుండి పర్యవేక్షిస్తుండడంపై కూడా వారు సంతోషం వ్యక్తం చేశారు. అలానే మాకు సహకరించిన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కు అధికారులకు కాంట్రాక్టర్ అర్జా సత్యనారాయణ కు ఆయన టీమ్ కు పిన్నెంటి రత్తయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య బీజేపీ నాయకుడు దాసరి శ్రీను మాజీ సర్పంచ్ పుప్పాల నరసింహారావు మాజీ సర్పంచ్ పిన్నెంటి ప్రభు ప్రసాద్,బత్తుల పూర్ణ,పిన్నెంటి గణేష్ పిన్నెంటి గంగరాజు చిటికినేని వెంకన్న, ఆకుల కృష్ణ, ఈమన శివ, జన్యావుల నాగబాబు ప్రత్తి రామాంజనేయులు, తోట వెంకటేశ్వరావు దాసరి కృష్ణ గుమ్మళ్ళ రఘు కన్నా సుబ్బయ్య గన్నా బత్తుల పాండురంగారావు,పాశం మద్ది రామయ్య చిటికినేని శ్రీను గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముద్రగడ మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు-మంద కృష్ణ మాదిగ

- ముద్రగడ సమాధి వద్ద మంద కృష్ణ మాదిగ నివాళి
- పేదల పక్షాన పోరాడిన మహానేత ముద్రగడ మంద కృష్ణ
- సామాజిక ఉద్యమాలకు దిక్సూచి ముద్రగడ పద్మనాభం
- తెలుగు నేల కోల్పోయిన ఉద్యమ యోధుడు ముద్రగడ
- ముద్రగడ కుటుంబాన్ని పరామర్శించిన మంద కృష్ణ మాదిగ
- కాపు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర "ముద్రగడ"ది
- --పదవుల కంటే సమాజానికే ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడు



**కిర్లంపూడి,జూలై 23 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత దివంగత ముద్రగడ పద్మనాభం సమాధి వద్ద ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు,పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నివాళులర్పించారు.ముద్రగడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి,అనంతరం ఆయన కుమారులు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు,బాలులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ పేద ప్రజల కోసం జీవితాంతం పోరాడిన మహానాయకుడు ముద్రగడ పద్మనాభమని కొనియాడారు.తెలుగు నేలపై సామాజిక ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచిన నాయకుల్లో ముద్రగడ ఒకరని,ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల్లో సామాజిక ఉద్యమాలకు పర్యాయపదంగా నిలిచిన కొద్దిమంది మహానుభావుల్లో ముద్రగడ పద్మనాభం పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.వంగవీటి మోహనరంగా హత్య అనంతరం కాపు ఉద్యమాన్ని ముందుకు నడిపించిన మహానేత ముద్రగడేనని గుర్తు చేశారు.రాజకీయ పదవులను పక్కనబెట్టి,తాను నమ్ముకున్న సమాజం కోసం జీవితాంతం పోరాడిన అరుదైన నాయకుడు ముద్రగడ పద్మనాభమని కొనియాడారు.తెలుగు నేలపై ఉద్భవించిన ప్రముఖ సామాజిక ఉద్యమకారుల్లో చరిత్ర సృష్టించిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# సేవా కార్యక్రమాలతో ఏఎన్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా

## -అభిమానుల సేవాభావమే అసలైన బహుమతి. ఏఎన్ బాబు




**ముదినేపల్లి,జూలై 23 (వార్తాప్రభ) :** కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండల జనసేన నాయకుడు ఏఎన్ బాబు జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య అత్యంత ఘనంగా, సేవా కార్యక్రమాల నడుమ నిర్వహించారు. కేవలం కేక్ కటింగ్‌లకే పరిమితం కాకుండా మండల వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి తమ అభిమాన నాయకుడిపై ఉన్న అభిమానాన్ని అభిమానులు చాటుకున్నారు. ఉదయం 9:30 గంటలకు ఏఎన్ బాబు స్వగ్రామమైన శ్రీహరిపురంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. అనంతరం ముదినేపల్లిలో కుమారస్వామి ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. గురజ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పాలు, పండ్లు, దుప్పట్లు, బట్టలు పంపిణీ చేసి మానవతా సేవను చాటుకున్నారు. అనంతరం సింగరాయపాలెంలో భారీ బహిరంగ సభ నిర్వహించి సుమారు 2,000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అభిమానులు, జనసేన కార్యకర్తలు, గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు. జన్మదినం సందర్భంగా గురజ, అన్నవరం, దేవరం, నరసన్నపాలెం, బొమ్మినంపాడు, ఈడేపల్లి, రాజానగరం, కొరగంటి పాలెం, పెద్దగున్నూరు, కొత్తపల్లి, వాడవల్లి తదితర గ్రామాల్లో అభిమానులు కేక్ కట్ చేసి ఏఎన్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. "జన్మదినం అంటే కేవలం వేడుకలు కాదు... సమాజానికి సేవ చేయడమే నిజమైన సంబరం" అనే సందేశాన్ని చాటేలా ఏఎన్ బాబు అభిమానులు నిర్వహించిన సేవా కార్యక్రమాలు స్థానిక ప్రజల ప్రశంసలు అందుకున్నాయి. మండల వ్యాప్తంగా జరిగిన ఈ వేడుకలు జనసేన శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

# కృష్ణలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో జిల్లా వైద్య అధికారి ఆకస్మిక తనిఖీ....

- పరిశుభ్రత, కనీస వసతుల పై ప్రత్యేక దృష్టి......
- రోగులకు మెరుగైన సేవలు అందించాలనీ సిబ్బంది నీ ఆదేశించిన జిల్లా వైద్యాధికారి



**విజయవాడ కృష్ణలంక,జూలై 23 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు కృష్ణలంక ప్రాంతం లోని,7 వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం లో పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న కనీస సౌకర్యాలు, వైద్య సేవలపై సమగ్రంగా పరిశీలించారు. తనిఖీ లో భాగంగా ఆరోగ్య కేంద్రం పరిసరాల తో పాటు లోపలి విభాగాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మహిళలు, పురుషుల మరుగు దొడ్ల లో నీటి సరఫరా, పరి శుభ్రతను స్వయంగా పరిశీలించారు. ప్రతి రోజూ పరి శుభ్రత, కనీస వసతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రయోగశాలను పరిశీలించి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, నివేదికల నమోదును తనిఖీ చేసి అవసరమైన సూచనలు చేశారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని కూడా సమీక్షించిన డీఎంహెచ్‌వో, అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న మందులను పరిశీలించి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు సూచించారు.

# ఎన్టీఆర్ జిల్లాను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు భవన యజమానులు ముందుకు రావాలి

● ఐటీ పరిశ్రమల స్థాపనకు అనువైన భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూముల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి ● పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,జూలై 23 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రంలో ప్రముఖ ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు భవన యజమానులు, పారిశ్రామికవేత్తలు, భూ యజమానులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లాలో ఐటీ పరిశ్రమలు, ఐటీ/ఐటీఈఎస్ సంస్థలు, స్టార్టప్ కంపెనీల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి పెట్టుబడిదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూములు, ఐటీ కార్యకలాపాలకు అనువైన ఇతర ఆస్తుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన itinfra.ap.gov.in పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ కోరారు. పెట్టుబడుల ఆకర్షణకు కీలక వేదిక ఐటీ సంస్థలు కొత్త ప్రాంతాల్లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అవసరమైన సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ పోర్టల్‌ను రూపొందించారని కలెక్టర్ తెలిపారు. భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ భూముల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను సులభంగా పరిశీలించి పెట్టుబడులు పెట్టే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిల్లాలోని కమర్షియల్ భవనాల యజమానులు, కార్యాలయ సముదాయాల నిర్వాహకులు, భూ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా తమ ఆస్తులకు విస్తృత ప్రచారం లభించడంతో పాటు ఐటీ సంస్థల అవసరాలకు అనుగుణంగా వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో ఐటీ పరిశ్రమల విస్తరణ ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఐటీ రంగ అభివృద్ధి ద్వారా జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు, నమోదు ప్రక్రియపై సమాచారం కోసం జిల్లా ఐటీ అధికారి సుశ్యామ్ 84979 61902 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సూచించారు.

# ఆగస్టు 2న జంగారెడ్డిగూడెంలో భారీ జాతీయ జెండా ర్యాలీ.. మంత్రికి ఆహ్వానం






**ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం,జూలై 23 (వార్తాప్రభ) :** జాతీయ జెండా రూపకర్త మహనీయుడు పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా ఆగస్టు 2న జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్న రెండు కిలోమీటర్ల భారీ జాతీయ జెండా ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని జంగారెడ్డిగూడెం కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు కార్యక్రమం ఉద్దేశ్యం, విశేషాలను మంత్రికి వివరించారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని ప్రజల్లో మరింత పెంపొందించే లక్ష్యంతో ఈ భారీ జాతీయ జెండా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య సేవలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. జాతీయ భావాన్ని చాటిచెప్పే ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మలబార్ లో 'ఆషాఢ మాస' ఆఫర్లు

**కాకినాడ,జూలై 23 (వార్తాప్రభ) :** మలబార్ గోల్డు, డైమండ్స్ ఉభయ తెలుగు రాష్ట్రాలలో తన అన్ని షోరూమ్లలో 'ఆషాఢమాస ఆఫర్లను' ప్రకటించింది. వినియోగదారులకు విస్తృత శ్రేణి ఆభరణాలపై ఆకర్షణీయమైన ఆదా అవకాశాలను అందిస్తోంది. పరిమిత ఆఫర్లలో భాగంగా బంగారం, అన్కట్,రత్నాల ఆభరణాల తరుగు ఛార్జీలపై గరిష్టంగా 30% వరకు తగ్గింపు,అలాగే డైమండ్ విలువపై గరిష్టంగా 30% వరకు తగ్గింపు పొందవచ్చునని నిర్వాహకులు తెలిపారు.అదనంగా, పాత బంగారం మార్పిడిపై 0% తగ్గింపు సదు-పాయం కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్లు 2026 జూలై 15 నుంచి ఆగస్టు 12 వరకు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా కర్ణాటకలోని అన్ని మలబార్ గోల్డ్ , డైమండ్స్ షోరూములలో నిబంధనలు షరతులకు లోబడి అందుబాటులో ఉంటాయన్నారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ మాట్లాడుతూ 'ఆషాఢ శుభ లాభ్' ద్వారా నాణ్యత, పారదర్శకమైన ఆభరణాలు లభిస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా లలోని వినియోగదారులందరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి ఆషాడ మాసం సారె సమర్పణ..





**పెనుగంచిప్రోలు,జూలై 23 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి పెనుగంచిప్రోలు గ్రామ మహిళలు ఆషాఢ మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు.అనంతరం సారె తీసుకువచ్చిన వారికి వేద పండితుల ఆశీర్వచనం, అన్నప్రసాదం అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు, సూపరింటెంట్ రాజు, సత్యనారాయణ,టెంపుల్ ఇన్స్పెక్టర్ బద్ధుల కృష్ణమోహన్, నవీన్, మాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ చుంచు రమేష్,గ్రామ మహిళాలు,భక్తులు పాల్గొన్నారు.

# దశాబ్దాల కల నెరవేర్చిన ఎమ్మెల్యే వెనిగండ్లకు ప్రజల కృతజ్ఞతలు...



**గుడ్లవల్లేరు,జూలై 23 (వార్తాప్రభ) :** దశాబ్దాల కలగా మారిన రోడ్డు నిర్మాణాన్ని రూ.89లక్షల ప్రభుత్వ నిధులతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిర్మించినందుకు గుడ్లవల్లేరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. జేమ్స్ పేట నుంచి చింతలగుంట, కట్టవాని చెరువు రోడ్డు పురిటిపాడు, చిన్న గొన్నూరు వరకు ఆర్ అండ్ బీ రోడ్డు పనులు గురువారం నుంచి ఆరంభమయ్యాయి. చింతలగుంటకు చెందిన కొండలమ్మ తల్లి దేవస్థాన చైర్మన్ ఈడే విష్ణు వెంకట మోహనరావు(మోహన్)తో పాటు స్థానికులు ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే సుజనా చౌదరిని కలిసిన సీఎల్ వెంకట్రావు...



**గుడ్లవల్లేరు,జూలై 23 (వార్తాప్రభ) :** విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరిని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ సీఎల్ వెంకట్రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుజనా చౌదరిని దుశ్శాలువాతో సన్మానించిన ఆయనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. డాక్టర్ సీఎల్‌తో పాటు పాపయ్య ఉన్నారు.

# కోనేరును మోడల్ ఐకాన్ గా తీర్చిదిద్దుతాం

టిడిపి రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దే)



**విస్సన్నపేట,జూలై 23 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మూడు చెరువులకు నైనానందకారంగా వాకర్ ట్రాక్కర్స్, డిజిటల్ లైట్స్, జిమ్ తదితర మౌలిక వసతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో ఏర్పాటు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దే) తెలియజేశారు. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు స్వచ్ఛమైన వాటర్ తో పాటు ఫల పుష్ప ఔషధ మొక్కలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆక్సిజన్ అందించే మొక్కల వలన వాకింగ్ కు వచ్చే వారందరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేశీనందుకు పరమపదసోపానంగా ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జెట్ స్పీడ్ తో 50 లక్షల (సోలార్ లైట్లు)రూపాయలు నిధులు తో లలితా సూపర్ మార్కెట్ పార్ట్నర్ కె రామకృష్ణ దగ్గర ఉండి లాభాపేక్ష లేకుండా పనులు చేయించడం జరుగుతుందని మోడల్ ఐకాన్ గా పరిసర ప్రాంత మండలాలలో విస్సన్నపేట కోనేరును తీర్చిదిద్దడం జరుగుతుందని అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు సరిహద్దుదారులు అందరూ సహకరించడంతో త్వరితగతిన అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, ఇరిగేషన్ డి ఈ వై అర్జునరావు, ఏ ఈ సలీం, ఆర్ ఐ సుజాత,ఈవో హరికృష్ణ కుమార్, ఏపీవో రామారావు, కాంట్రాక్టర్ లలిత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పూరీ సముద్ర తీరంలో కేటీఆర్ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసిన ఉద్యమకారుడు రవీందర్ యాదవ్




**శేరిలింగంపల్లి,జూలై 23 (వార్తాప్రభ) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఒడిశాలోని పూరీ సముద్ర తీరంలో శేరిలింగంపల్లికి చెందిన ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేశారు.శిల్పంపై "ఫ్యూచర్ సీఎం ఆఫ్ తెలంగాణ" అనే సందేశాన్ని ప్రదర్శించగా, పర్యాటకులు ఆసక్తిగా వీక్షించి ఫొటోలు తీసుకుంటూ కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు తెలిపారు.

**మహారాజశ్రీ మొవ్వ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టు లో**

ఈ.పి.నెంబర్ : 01/2026

Between :

తోట వర ప్రసాద్

----డి.హెచ్. ఆర్ / వాది

మరియు

వేమూరి రాజ రాజేశ్వరి

----జె. డి. ఆర్/ ప్రతివాది

టు :

వేమూరి రాజ రాజేశ్వరి,
భర్త : సీతారామంజనేయులు,
చింతగుంట పాలెం, మచిలీపట్నం మండలం, కృష్ణా జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

(జె. డి. ఆర్ / ప్రతివాది)

పై నెంబర్ గల పేటీషన్ లో ప్రతివాదికి, వాది శ్రీ తోట వర ప్రసాద్ ప్రతివాదిపై ఈ.పి నిమిత్తం పేటీషన్ దాఖలు చేయగా ప్రతివాది కి సమన్లు నిమిత్తము ఎన్ని సార్లు నోటీసులు చేసిననూ ప్రతివాది గ్రామం లో ఉండి కూడా నోటిస్ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున substitute సర్వీసెస్ ద్వారా అనగా పేపర్ పబ్లికేషన్ ద్వారా సమన్లు జారీ చేయుటకు శ్రీ కోర్టు వారు ది 19-08-2026 వ తేదికి వాయిదా వేసినారు. ఆ రోజు పగలు 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ప్రతివాది స్వయముగా కానీ లేదా వకీల్ ద్వారా గానీ హాజరు అయ్యి ప్రతివాదికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు విచారించి ప్రతివాది పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియపరచడమైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)**

**వాయిదా తేదీ : 19-08-2026**

**ఇట్లు :**

**బొల్లా అశోక్ వర్ధన్**

**వాది తరపు అడ్వకేట్, మొవ్వ.**

**సెల్ : 9441533364**

మొవ్వ

తేదీ : 23-07-2026

# జ్ఞానసాయికి ప్రత్యేక పూజలు



**గుడ్లవల్లేరు,జూలై 23 (వార్తాప్రభ) :** మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో గురువారం వేకువజామున స్వామివారికి విశేషాభిషేకాలను వేద పండితులు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులను అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఆంజనేయ ప్రసాద్, నాగవల్లి, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

## దస్తావేజులు పోయినవి

బొబ్బా హరిశ్చంద్ర ప్రసాద్ గారు, వయస్సు: 60 సం॥లు, తండ్రి: బొబ్బా మల్లిఖార్జునరావు గారు, సాకిన్: డోర్ నెం. 3-57రు, వైష్ణవి నిలయం, వైష్ణవి పార్క్ ఈడుపుగల్లు గ్రామము, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా. ఆధార్ నెం. 8225 2707 9183. అనే నేను చేయు ప్రకటన.

నా కుమార్తె అయిన బొబ్బా బిందుకు భర్త అయిన వీరమాచనేని రామకృష్ణ గారి తాలూకు దస్తావేజు నెం. 5715/2017 కు దాఖలు అయిన ఆస్తి ఈడుపుగల్లు గ్రామ రీస సర్వే నెం. 222 రు దాఖలా ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (APCRDA) విజయవాడ వారిచే ఎల్‌పి నెం. 20/2015 /విజెఎ రుగా అప్రూవల్ కాబడిన ప్లాన్ దాఖలా విజయ కృష్ణాపురం నందిలి ప్లాట్ నెం.2రు దాఖాలా చ.గ. 277.0 లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలముకు ఇసి నిమిత్తం సదరు నెం.5715/2017రు గల ఒరిజినల్ దస్తావేజు మరియు లింక్ దస్తావేజు జిరాక్స్ కాపీలు తీసుకుని నేను ఈడుపుగల్లు నుండి కంకిపాడు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసుకు వచ్చుచున్న సమయములో సదరు దస్తావేజును ఎక్కడో పోయి ఉన్నది. నా దస్తావేజులు ఎవరికైనా దొరికినచో అందచేయవలసిందిగా కోరుతున్నాను.

**ఇట్లు :**

**బొబ్బా హరిశ్చంద్ర ప్రసాద్**

**ఫోన్ నెం. 98662 39999**

**తేది : 07.07.2026**

**గ్రామము : కంకిపాడు**

# నేడు (ఈ నెల 24) పండగలా మెగా పీటీఎం 4.0

● విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విలువైన వేదిక ● కార్యక్రమం విజయవంతానికి సమష్టి కృషి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూలై 23 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, సమగ్రాభివృద్ధి, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమాన్ని ఈ నెల 24న శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచడం, పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం వంటివాటికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 691 ప్రాథమిక, 23 ప్రాథమికోన్నత, 208 ఉన్నత పాఠశాలలతో పాటు 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు గౌరవ ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఇందులో ముఖ్యంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలను విశ్లేషించడంతో పాటు పాఠశాలలో సౌకర్యాలు, పదో తరగతి ఫలితాలు, తల్లికి వందనం పథకం, షైనింగ్ స్టార్స్, ప్రాథమిక స్థాయిలోని జి-ఎఫ్ఎల్ఎన్ ఫలితాలు తదితర అంశాలు, పథకాలపై వివరించడం జరుగుతుందన్నారు. విద్యతో పాటు క్రీడా సామగ్రి, ఫొటో గ్యాలరీ ప్రదర్శనలు కూడా ఉంటాయని.. తల్లిదండ్రులకు రంగవల్లి, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లీప్ యాప్ ప్రదర్శనతో పాటు ముఖ్య అతిథులు ప్రసంగాలు, ప్రశ్నోత్తరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద సిద్ధం చేసిన ఆహారాన్ని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, అతిథులు రుచిచూస్తారని తెలిపారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి పని కల్పించాల్సిందే...



**గుడ్లవల్లేరు,జూలై 23 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ అధ్యక్షతన వి.బి.జి.ఆర్.ఏ.ఎం.జి. పనుల డిమాండ్ పెంపు, పనుల ప్రణాళిక మరియు అమలుపై మండల సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఇమ్రాన్ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి పని కల్పించే దిశగా ఫీల్డ్ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల వారీగా పనుల ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన చోట కొత్త పనులను గుర్తించి వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల అమలులో నాణ్యత, హాజరు నమోదు, పనుల పురోగతిని పెంచాలన్న ఆయన పనులను పరిశీలించాలని తెలిపారు. అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పరస్పర సమన్వయంతో ఉండాలని కోరారు. ఏపీఓ నత్తా స్ఫూర్తి, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ముసుగులో నీరు గారుతున్న పోరాటం...



**గుడ్లవల్లేరు,జూలై 23 (వార్తాప్రభ) :** ఉద్యమకారుల ముసుగులో పోరాటాన్ని నీరు గార్చేందుకు కనీసం లైసెన్సులు కూడా లేనటువంటి కొందరు నాయకులు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు వెళ్లటం విడ్డూరంగా ఉందని కౌతవరం శాఖ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ నాయకులు వేమవరపు సత్యనారాయణ, నల్లమోతు సురేష్, నూతులపాటి కష్ణప్రసాద్ ఆరోపించారు. కౌతవరం సబ్ రిజిష్టారు కార్యాలయం ఎదుట గురువారం కొనసాగిన దీక్షలో దస్తావేజు లేఖరులు, డిటిపి ఆపరేటర్స్, స్టాంపు వెండర్సు పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి లైసెన్సు పొందనటువంటి దస్తావేజు లేఖరులు ఎలా తమ సంఘ నాయకులుగా పేరు చెప్పుకుంటారని ప్రశ్నించారు. కేవలం తమ ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు కొందరు నాయకుల ముసుగులో ప్రభుత్వంతో జరిపిన చర్చలను నమ్మవద్దని పేర్కొన్నారు. రాష్ట్ర సంఘ నాయకులంటే వారు నిర్ణయం తీసుకునే ముందు అన్ని జిల్లాల స్థాయి సంఘ నాయకులతో సంప్రదించటం కనీస ధర్మం అన్నారు. మూడు రోజులుగా చేసిన ఈ పెన్ డౌన్ కార్యక్రమాన్ని నీరుగార్చటం ఒక కుట్రగా భావిస్తున్నామని ఆరోపించారు. ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకుండా ఆందోళన విరమించడం జరగదన్నారు. ప్రభుత్వం వారు రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేస్తూ జారీ చేసిన జీవో 396ను రద్దు చేయాలని కోరారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188